పక్కా తెలుగు

PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 007 | బుధవారం | 01-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 007 | Wednesday | 01-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



2లో..

## బండి సంజయ్ పై కేసు కొట్టివేత

కేంద్ర మంత్రికి నాంపల్లి కోర్టు క్లీన్ చిట్!



2లో..

## న్యాయపోరాటంలో నెగ్గిన సింహం!

- రాజాసింగ్ పై కేసు కొట్టివేత
- ప్రత్యేక కోర్టు చారిత్రాత్మక తీర్పు



3లో..

## అమీతుమీ

**అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రండి!**

**బీజేపీ నేతలకు పొన్నం బహిరంగ సవాల్**

వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత బీజేపీ నాయకులకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. కొత్తగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు వాస్తవాలు తెలియకుండా కేవలం తన ఉనికి కోసం మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. దీనికోసం రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే అవసరమైన భూమిని కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎయిర్‌పోర్టు ప్రక్రియ వేగం పుంజుకుందని చెప్పారు. పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండి కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా తెలంగాణ

**• దోపిడీ పైసలతో కాంగ్రెస్‌కు కాసులు • రేవంత్ సర్కారుపై బీజేపీ చీఫ్ ఫైర్**



2లో..

తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ తమ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా మార్చేసిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో ప్రస్తుతం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని, ఇక్కడి ప్రజల రక్తాన్ని పిండి వసూలు చేస్తున్న డబ్బులు నేరుగా ఢిల్లీకి తరలిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పాలనలో ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆరు గ్యారంటీలూ అట్టర్ ప్లాప్

తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారంటీలు ఇచ్చిందని, కానీ అందులో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని నితిన్ నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, నేరాలతో కూడిన దారుణమైన పాలన సాగిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. అవన్నీ లోపల ఒక్కటేనని, కలిసికట్టుగా ప్రజలను మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ నేతృత్వంలో నడవడానికి, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఇప్పుడే సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.



# ఫీజు పోరు

**విద్యార్థులకు ఊరటనిచ్చిన హైకోర్టు**

**మధ్యంతర స్టే ఉత్తర్వులు పొడిగింపు**

**విచారణ జూలై ఆరుకు వాయిదా**

**తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలు, విద్యార్థుల మధ్య నలుగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వివాదంపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన వివిధ పిటిషన్లపై విచారణను న్యాయస్థానం వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తాత్కాలికంగా పెద్ద ఉపశమనం లభించినట్లయింది. విద్యాసంస్థల్లో నెలకొన్న అనిశ్చితి కొంతవరకు తొలగిపోయింది.**

### ప్రభుత్వ జీవోకు బ్రేక్ వేసిన న్యాయస్థానం

గత విచారణ సందర్భంగా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కొన్ని కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 9లోని నాలుగు నిబంధనలపై తాత్కాలికంగా స్టే విధించింది. విద్యార్థుల నుండి బలవంతంగా ఫీజులు వసూలు చేయరాదని స్పష్టం చేసింది. ప్రభుత్వ జీవోలోని కొన్ని వివాదాస్పద అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలు విన్న తర్వాతే న్యాయస్థానం ఈ తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చింది.

### తదుపరి తీర్పుపై సర్వత్రా ఆసక్తి

జులై 6వ తేదీన జరగబోయే తదుపరి విచారణలో తెలంగాణ ప్రభుత్వం, పిటిషనర్ల పూర్తిస్థాయి వాదనలను న్యాయస్థానం పరిశీలించనుంది. ఆ తర్వాత హైకోర్టు మరిన్ని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తుది తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును, విద్యాసంస్థల మనుగడను శాసించనుంది. దీనివల్ల విద్యా రంగంలో ఈ కేసుపై తీవ్రమైన ఆసక్తి నెలకొంది. చట్టపరమైన ఇబ్బందులు తొలగి తమకు పూర్తి న్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.




# బకాసురుడి అప్పులు.. మాపై పాపాలు

- తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు
- 44.28 లక్షల మందికి రూ.2,482 కోట్లు జమ
- మంత్రులతో కలసి నిధులను విడుదల
- శిల్పకళావేదిక సాక్షిగా నిధుల విడుదల

రాష్ట్రంలోని లక్షలాది మంది అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఊరటనిచ్చింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా నిధులను అధికారికంగా విడుదల చేశారు. తొలి విడత కింద రెండు ఎకరాల లోపు భూమి కలిగిన సుమారు 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను ప్రభుత్వం నేరుగా జమ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి సీఎం ఈ బటన్ నొక్కారు. రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. (వివరాలు 2లో..)

## కాళేశ్వరం కూలినా.. సాగులో నంబర్ వన్





2లో..

## భద్రాద్రిలో ఖాకీల మెరుపు దాడి!

**భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు • 525 కిలోల గంజాయి స్వాధీనం**

## పైసా వసూల్..

- యుద్ధం యుద్ధమే.. పైసలు పైసలే..
- నిప్పుల నడుమ నోట్ల వర్షం!
- యుద్ధం ముదిరినా కాసుల గలగలలు

3లో..




3లో..

## కర్రుగాల్చి వాత

- ట్రంప్ పంతానికి సుప్రీం బ్రేక్!
- ఇకపైనా జన్మతః పౌరసత్వం హక్కు
- అమెరికా అధ్యక్షుడికి కోర్టు ఝలక్




3లో..

## పీఓకే తిరుగుబాటు!

- పాకిస్తాన్ వద్దు.. ఇండియా ముద్దు
- ఆక్రమిత కశ్మీర్‌లో ఉండలేం
- ఇండియా జోక్యం చేసుకోవాల్సిందే
- రగిలిపోతున్న రావాలాకోట్ ఈద్గా మైదానం

# హరీశ్ వర్సెస్ రేవంత్



- »ఎవరిని ఎవరు ఓడిస్తారు?
- »హరీశ్‌ను ఓడిస్తే మంత్రి పదవిస్తా?
- »నాడు సిద్దిపేటలో సీఎం దూకుడు
- »నేడు రేవంత్‌ను టార్గెట్ చేసిన హరీశ్
- »కొడంగల్‌తో సహా 14 సీట్లలో ఓడిస్తా
- »హస్తం పార్టీకి ఓ రేంజ్‌లో సవాల్

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు మధ్య సవాళ్ల పర్వం తీవ్రస్థాయికి చేరింది. సిద్దిపేటలో హరీశ్ రావును ఓడిస్తే కాంగ్రెస్ అభ్యర్థికి కేబినెట్ పదవి ఇస్తానంటూ నాడు సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 1984 నుండి సాగుతున్న ఒకే కుటుంబం పట్టుకు వచ్చే ఎన్నికల్లో చెక్ పెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సవాళ్లకు తాజాగా హరీశ్ రావు పాలమూరు గడ్డపై గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తో సహా పాలమూరు ప్రాంతంలోని మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తుడిచిపెడతామని శపథం చేశారు. ఎవరి కోటను ఎవరు బద్దలు కొడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

(వివరాలు 2లో..)

## పాలమూరు పరువు తీస్తోన్న రేవంత్

**ముఖ్యమంత్రి పీఠం విలువ తగ్గించారు**

**కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ రావు గర్జన**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా అన్నదాతలను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

## 30 నెలల్లో రూ.30 వేల కోట్ల ఎగవేత



**రైతుభరోసా నిధుల పబ్లిసిటీ స్టంట్లు**

**సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆయన ఆరోపించారు.

## ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా

# తెలంగాణ

**దోపిడీ పైసలతో కాంగ్రెస్‌కు కాసులు ■ రేవంత్ సర్కారుపై బీజేపీ చీఫ్ ఫైర్**



తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ తమ ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా మార్చేసిందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో ప్రస్తుతం 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని, ఇక్కడి ప్రజల రక్తాన్ని పిండి వసూలు చేస్తున్న డబ్బులు నేరుగా ఢిల్లీకి తరలిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పాలనలో ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆరు గ్యారంటీలూ అట్టర్ ఫ్లాప్

తెలంగాణలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు గ్యారంటీలు ఇచ్చిందని, కానీ అందులో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని నితిన్ నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, నేరాలతో కూడిన దారుణమైన పాలన సాగిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరుగా నటిస్తున్నప్పటికీ.. అవన్నీ లోపల ఒక్కటేనని, కలిసి కట్టుగా ప్రజలను మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ నేతృత్వంలో నడవడానికి, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఇప్పుడే సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

### కార్యకర్తల కష్టంతోనే బెంగాల్ విజయం

తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేస్తున్నామని నితిన్ నబీన్ గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ ఎలా గెలిచిందని చాలా మంది నన్ను అడుగుతున్నారని, అది కేవలం పార్టీ కార్యకర్తల ప్రాణత్యాగాలు, కష్టం వల్లే సాధ్యమైందని చెప్పారు. బెంగాల్‌లో అధికార పార్టీ మన కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా పనిచేశారని కొనియాడారు. తెలంగాణలో కూడా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## న్యాయపోరాటంలో నెగ్గిన సింహం!

- ■ రాజాసింగ్ పై కేసు కొట్టివేత
- ■ ప్రత్యేక కోర్టు చారిత్రాత్మక తీర్పు



వివాదాస్పద వ్యాఖ్యల కేసులో గోషామహల్ భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్‌కు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. 2022 సంవత్సరంలో ఆయనపై నమోదైన ఒక పాత కేసును హైదరాబాద్ ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ఇరుపక్షాలు వినిపించిన సుదీర్ఘ వాదనలను, సమర్పించిన సాక్ష్యాధారాలను న్యాయమూర్తి నిశితంగా పరిశీలించారు. రాజాసింగ్‌పై పోలీసులు మోపిన ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని, అవన్నీ సరైనవి కావని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ తుది తీర్పును వెలువరించింది. ఈ వివాదం 2022 ఆగస్టు నెలలో ప్రారంభమైంది. హైదరాబాద్ నగరంలో ఒక స్టాండప్ కమెడియన్ షో నిర్వహించడాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ షోకు నిరసనగా ఆయన యూట్యూబ్‌లో ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియో అప్పట్లో దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్ని రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై తీవ్రమైన ఐపీసీ సెక్షన్ల కింద పలు కేసులు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన తర్వాత పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు అరెస్ట్ నిబంధనలు పాటించలేదనే కారణంతో స్థానిక కోర్టు మొదట రిమాండ్‌ను తిరస్కరించి ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న పరిణామాల వల్ల, శాంతిభద్రతల రక్షణ దృష్ట్యా పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. దీనివల్ల రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది. ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పుతో ఆయనపై ఉన్న చట్టపరమైన ఇబ్బందులన్నీ పూర్తిగా తొలగిపోయాయి.

## భద్రాద్రిలో ఖాకీల మెరుపు దాడి!

- ■ భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు
- ■ 525 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఒక భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టయింది. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు చాకచక్యంగా అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లు గప్పి తప్పించుకోవడానికి లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు.

### కోట్ల విలువైన సరుకు స్వాధీనం

లారీని క్షుణ్ణంగా సోదా చేసిన పోలీసులు అందులో దాచిన దాదాపు 525 కిలోల నాణ్యమైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మెరుపు దాడిలో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే రంగులరాట్నంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న పెద్ద లారీతో పాటు నిందితుల ముఠాకు రక్షణగా, ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

### ముఠా గుట్టు విప్పే పనిలో పోలీసులు

వాహనాలతో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను విచారించడం ద్వారా ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని డ్రగ్స్ రవాణాకు అడ్డాగా మార్చాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## సమగ్ర ఓటర్ల సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

- ■ పొదిలి పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పర్యటన
- ■ దొంగ ఓట్ల ఏరివేతకు ప్రజలు సహకరించాలని పిలుపు
- ■ స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ



**పొదిలి, జూన్ 30(నాదేశం):** నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమానికి ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని మార్కాపురం శాసనసభ్యులు శ్రీ కందుల నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పొదిలి పట్టణంలోని పలు వార్డులలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. జరుగుతున్న ఓటర్ల సర్వే ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పారదర్శకతకు ఈ సర్వే ఎంతో కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సర్వేకు సంబంధించిన అవసరమైన పత్రాలను బూత్ స్థాయి అధికారులకు అందజేసి సహరించాలని కోరారు. ఎక్కడైనా దొంగ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి, జాబితా నుండి వేరు చేయడానికి అధికారులకు స్థానిక ప్రజలు, నాయకులు తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. పర్యటనలో భాగంగా ఆయా వార్డుల్లో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన.. అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

# బకాసురుడి అప్పులు.. మాపై పాపాలు

- ■ కాళేశ్వరం కూలినా.. సాగులో నంబర్ వన్
- ■ తెలంగాణ రైతుల ఖాతాల్లో భరోసా నిధులు
- ■ 44.28 లక్షల మంది ఖాతాల్లో రూ.2,482 కోట్ల జమ
- ■ మంత్రులతో కలసి నిధులను విడుదల
- ■ శిల్పకళావేదిక సాక్షిగా నిధుల విడుదల



రాష్ట్రంలోని లక్షలాది మంది అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఊరటనిచ్చింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా నిధులను అధికారికంగా విడుదల చేశారు. తొలి విడత కింద రెండు ఎకరాల లోపు భూమి కలిగిన సుమారు 44.28 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను ప్రభుత్వం నేరుగా జమ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి సీఎం ఈ బటన్ నొక్కారు. రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు.

### బకాసురుడి అప్పులు.. మాపై పాపాలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?" అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు కేవలం రూ.69 వేల కోట్లు ఉంటే, 2023 నాటికి కేసీఆర్ ప్రభుత్వం దానిని రూ. 8.11 లక్షల కోట్లకు చేర్చిందని మండిపడ్డారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని, తమ ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు.

### కాళేశ్వరం కూలినా.. వరిసాగులో ఫస్ట్

వేల కోట్ల రూపాయల కమీషన్ల కోసమే బీఆర్ఎస్ హయాంలో హడావుడిగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన ఆ ప్రాజెక్టు కూలిపోయినప్పటికీ, ఇవాళ సొంతంగా బోరు బావుల కింద పంటలు పండించి వరిసాగులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అని రైతులను బెదిరించారని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుండా ఊరూరా బెల్ట్ షాపులు తెచ్చి తాగుడు సంస్కృతిని నేర్పించారని ధ్వజమెత్తారు.

### రైతుల కోసం కోట్ల రూపాయల వ్యయం

వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనే పరిస్థితిని తమ ప్రభుత్వం కల్పిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. రాబోయే తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో మరో రూ.9 వేల కోట్లు వేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచుల బిల్లులు, బడి పిల్లల తిండి బిల్లులను కేసీఆర్ పెండింగ్ పెడితే.. ఆ బద్నాం తాము మోయాల్సి వస్తోందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# హరీశ్ వర్సెస్ రేవంత్

- ■ ఎవరిని ఎవరు ఓడిస్తారు?
- ■ హరీశ్‌ను ఓడిస్తే మంత్రి పదవిస్తా?
- ■ నాడు సిద్దిపేటలో సీఎం దూకుడు
- ■ నేడు రేవంత్‌ను టార్గెట్ చేసిన హరీశ్
- ■ కొడంగల్‌తో సహా 14 సీట్లలో ఓడిస్తా
- ■ హస్తం పార్టీకి ఓ రేంజ్‌లో సవాల్



తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు మధ్య సవాళ్ల పర్వం తీవ్రస్థాయికి చేరింది. సిద్దిపేటలో హరీశ్ రావును ఓడిస్తే కాంగ్రెస్ అభ్యర్థికి కేబినెట్ పదవి ఇస్తానంటూ నాడు సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 1984 నుండి సాగుతున్న ఒకే కుటుంబం పట్టుకు వచ్చే ఎన్నికల్లో చెక్ పెడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సవాళ్లకు తాజాగా హరీశ్ రావు పాలమూరు గడ్డపై గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తో సహా పాలమూరు ప్రాంతంలోని మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తుడిచిపెడతామని శపథం చేశారు. ఎవరి కోటను ఎవరు బద్దలు కొడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### హరీశ్ టార్గెట్‌గా నాడు రేవంత్ పంచ్‌లు

తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు అగ్రనేతల మధ్య సవాళ్ల పర్వం ముదిరింది. నాడు సిద్దిపేట పర్యటనలో సీఎం రేవంత్, హరీశ్ రావుకు వ్యతిరేకంగా హీట్ పెంచేలా సంచలన వ్యాఖ్యలు చేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గం నుండి హరీశ్ రావును ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే వారికి వచ్చే కేబినెట్‌లో కచ్చితంగా మంత్రి పదవి ఇస్తానని ఆఫర్ ప్రకటించారు. 1984 నుండి సిద్దిపేటలో ఒకే కుటుంబం అధికారం చలాయిస్తోందని, ఆ పట్టును వచ్చే ఎన్నికల్లో పూర్తిగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి అడ్డుపడే పురుగులను ఎలా వదిలించాలో తనకు బాగా తెలుసని రేవంత్ రెడ్డి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆ వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అనేకసార్లు కౌంటర్ ఇచ్చినా తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు కాక రేపుతున్నాయి.

### పాలమూరు గడ్డపై హరీశ్ రావు గర్జన

రేవంత్ రెడ్డి విసిరిన సవాళ్లకు బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తో సహా పాలమూరు ప్రాంతంలోని మొత్తం 14 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తుడిచిపెడతామని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని చిత్తుగా ఓడిస్తామని ఆయన శపథం చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభ రైతు ఆశీర్వాద సభ కాదని, అది రైతులను ఘోరంగా వంచించే సభ అని విమర్శించారు. ఎవరి కోటను ఎవరు బద్దలు కొడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### కోటలు బద్దలు కొట్టే కురుక్షేత్రం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుల మధ్య సాగుతున్న ఈ రాజకీయ రగడ తెలంగాణలో రాబోయే ఎన్నికల వేడిని ఇప్పుడే తెచ్చింది. ఒకరు సిద్దిపేట కోటను బద్దలు కొడతామని సవాల్ విసురుతుంటే.. మరొకరు కొడంగల్ వేదికగా పాలమూరు గడ్డపై కాంగ్రెస్‌ను తుడిచిపెడతామని శపథం చేస్తున్నారు.

## 30 నెలల్లో రూ.30 వేల కోట్ల ఎగవేత

- ■ రైతుభరోసా నిధుల పబ్లిసిటీ స్టంట్లు
- ■ సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆయన ఆరోపించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని ద్రోహంగా ఆపేశారని మండిపడ్డారు. ఇంత దారుణంగా మోసం చేస్తూ, మళ్లీ సభల పేరుతో నాటకాలు ఆడటానికి ప్రభుత్వానికి ఎలా సిగ్గు అనిపించడం లేదని కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు.

### బటన్ నొక్కడానికీ పీఆర్ స్టంట్లా?

హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి రైతుభరోసా నిధులు విడుదల చేసే కార్యక్రమంపై కేటీఆర్ తీవ్ర అసహ్యం వ్యక్తం చేశారు. కేవలం ఒక్క కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో వేయాల్సిన నిధుల కోసం ఇంత పెద్ద బహిరంగ సభలు పెట్టడం కేవలం పబ్లిసిటీ స్టంట్స్ మాత్రమేనని విమర్శించారు. గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులు చూస్తున్నారని, వారంతా ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారని చెప్పారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని నమ్మించి, ఇప్పుడు ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రుణమాఫీ మోసం.. ఢిల్లీ టూర్ల ఖర్చు

రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన రెండు లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చారాణా వంతు కూడా సరిగ్గా చేయలేదని కేటీఆర్ ఎండగట్టారు. అధికారంలోకి రాగానే అన్నదాతల గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు చేసిన 72 ఢిల్లీ టూర్లకు, ఈ నిరుపయోగమైన పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదా చేసి ఉంటే.. ఆ డబ్బు రైతులకు పెట్టుబడి సాయంగా దక్కేదని హితవు పలికారు. అరకొరగా కేవలం ఒకటి లేదా రెండు ఎకరాలు ఉన్నవారికి మాత్రమే నిధులు వేసి చేతులు దులుపుకుంటున్నారని ధ్వజమెత్తారు.

### యూరియా కొరత..

### కేసీఆర్ పాలనతో పోలిక

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా దొరకక అల్లాడుతున్నారని, ఈ సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే ప్రభుత్వం ఇటువంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేంద్రం ఎంత కొంటే అంతే పంట కొంటామని చెప్పి కొనుగోళ్ల బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకుందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని గుర్తు చేశారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం రైతు ద్రోహిగానే మిగిలిపోతారని కేటీఆర్ స్పష్టం చేశారు.

## పాలమూరు పరువు తీస్తోన్న రేవంత్

- ■ ముఖ్యమంత్రి పీఠం విలువ తగ్గించారు
- ■ కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ రావు గర్జన




కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా అన్నదాతలను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో నిర్వహిస్తున్నది రైతుల ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ రైతు వంచన సభేనని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జడ్చర్లలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడిన వివిధ వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించారు. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ పూర్తిగా తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు.

### బోనస్ హామీలన్నీ బోగస్ వ్యవహారాలు

గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి ఇచ్చిన బోనస్ హామీ అంతా ఒక బోగస్ వ్యవహారంగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చివరకు రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదు కాబట్టే.. ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్‌లంటూ కొత్త కథలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు.

### జిల్లా మంత్రుల తీరుపై చమత్కారాలు

ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కూడా హరీశ్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ మార్క్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హరీశ్ రావు హెచ్చరించారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం అరకొరగా ఇస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కోట్ల రూపాయల బాకీపై డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పంటకు 3 ఎకరాలే ఇచ్చిందని, ఇంకో పంటకు కేవలం 2 ఎకరాల వరకే ఇచ్చి చేతులు దులుపుకుందని హరీశ్ రావు లెక్కలు వివరించారు. వారు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం లెక్క తీస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.29,300 కోట్లు రైతు బంధు పేరిట రైతులకు బాకీ పడిందన్నారు. "జడ్చర్ల సభ నుంచి అడుగుతున్నా.. రేవంత్ రెడ్డి నువ్వు పెట్టుకున్న ఈ రైతు వంచన సభలో రూ.29,300 కోట్లు ఎప్పటిలోపు ఇస్తావో తెలంగాణ రైతాంగానికి చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఈ బాకీ పడ్డ డబ్బులు ఎన్ని రోజుల్లోగా తిరిగిస్తావో తెలంగాణ రైతుల పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన నిలదీస్తున్నట్లు స్పష్టం చేశారు.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా జరగాలి

- ■ బి.ఎల్.ఓలు, తహసిల్దార్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్
- ■ పొట్టిసుబ్బయ్యపాలెంలో కలెక్టర్ పరిశీలన
- ■ విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు



**వేటపాలెం, జూన్ 30 (నాదేశం) :** ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను జిల్లాలో అత్యంత పక్కాగా నిర్వహించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వే ప్రక్రియలో ఆయన స్వయంగా పాల్గొని పరిశీలించారు.

కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రస్తుత 2025 ఓటర్ల జాబితాకు అనుసంధానిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామంలోని కొండూరి పోతురాజు నివాసం లో కలెక్టర్ స్వయంగా విచారణ జరిపారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో ఉన్న వారి వివరాలను, 23 ఏళ్ల క్రితం నాటి జాబితాలోని వివరాలతో అనుసంధానిస్తూ ఓటు మ్యాపింగ్ ప్రక్రియను చేయించి చూశారు. పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ నత్తనడకన సాగడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత బూత్ స్థాయి అధికారిని అక్కడికక్కడే నిలదీశారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అధికారులు దీనిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత బి.ఎల్.ఓలతో పాటు తహసిల్దార్లపై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎస్. నరసింగరావు, స్థానిక తహసిల్దార్ గీతారాణీ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అమీ తుమీ..

## అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రండి!

- బీజేపీ నేతలకు పొన్నం బహిరంగ సవాల్

వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత బీజేపీ నాయకులకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండి పడ్డారు. కొత్తగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు వాస్తవాలు తెలియకుండా కేవలం తన ఉనికి కోసం మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన భూమిని కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎయిర్‌పోర్టు ప్రక్రియ వేగం పుంజుకుందని చెప్పారు. పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఉండి కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### రూ.5 వేల కోట్లతో డ్రైనేజీ పనులు

హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అతిపెద్ద అభివృద్ధి కేంద్రంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. స్మార్ట్ సిటీ నిధులపై తప్పుడు ఆరోపణలు చేసే బీజేపీ నేతలు.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి తెచ్చారో చెప్పాలన్నారు. కార్పొరేషన్‌లో కనీస మెజారిటీ లేకుండానే మేయర్ అవుతామనడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బండి సంజయ్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు.

### తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

తెలంగాణ నుండి కేంద్రానికి వెళ్లే ప్రతి పది రూపాయలలో తిరిగి రాష్ట్రానికి కేవలం మూడు రూపాయలు మాత్రమే వస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రావలసిన నిధుల కోసం ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా ఢిల్లీ వెళ్లినా కేంద్రంలో చలనం లేదన్నారు. ఎరువుల సరఫరా విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ఎరువులు తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేసే పూర్తి బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. ఇక్కడ బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి ఉద్దేశపూర్వకంగా సరఫరా తగ్గించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఎరువుల కొరత ఇలాగే కొనసాగితే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

### రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు

అభివృద్ధి గిట్టని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం చేసే మంచి పనులను చూసి జీర్ణించుకోలేక కేటీఆర్, హరీష్ రావులు ఆవేశంతో, ఆక్రోశంతో మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలు వారిని ప్రతి ఎన్నికల్లో ఓడిస్తూనే ఉన్నారన్నారు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ప్లాంట్ల అక్రమాలపై తాము సీబీఐ విచారణ కోరినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందాలతో పని చేస్తున్నాయని విమర్శించారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎవరైనా ప్రజల ముందే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# పైసా వసూల్..

- యుద్ధం యుద్ధమే.. పైసలు పైసలే..
- నిప్పల నడుమ నోట్ల వర్షం!
- యుద్ధం ముదిరినా కాసుల గలగలలు



గల్ఫ్ దేశాలలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆందోళన నెలకొంది. అయినా కూడా మన దేశానికి వచ్చే విదేశీ డబ్బు మాత్రం తగ్గలేదు. 2026 ఏప్రిల్ నెలలో గల్ఫ్ దేశాల నుండి భారతదేశానికి వచ్చిన నికర విదేశీ ఆదాయం... రెమిటెన్సెస్ ఏకంగా 70 శాతం పెరిగింది. యుద్ధం జరుగుతున్న రెండో నెలలోనే దాదాపు 16 బిలియన్ డాలర్ల డబ్బు భారత్‌కు చేరింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది.

### సంక్షోభంలోనూ చెక్కుచెదరని ధీమా

గల్ఫ్ ప్రాంతంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం వల్ల భారత్‌కు వచ్చే డబ్బు తగ్గిపోతుందని చాలామంది భయపడ్డారు. కానీ ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం ఆ భయాలు అబద్ధమని తేలింది. గతంలో వచ్చిన కోవిడ్ 19 మహమ్మారి వంటి పెద్ద సంక్షోభాల సమయంలో కూడా విదేశీ డబ్బు ఇలాగే స్థిరంగా వచ్చింది. ఇతర పెట్టుబడులతో పోలిస్తే వలస కార్మికులు పంపే డబ్బు చాలా నమ్మకమైనది. మార్కెట్ హెచ్చుతగ్గులు, యుద్ధ భయాలు దీనిని ఏమాత్రం ప్రభావితం చేయలేవని ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయి.

### మార్కెట్ సిగ్నల్స్ కాదు.. శ్రమ నమ్ముకున్నారు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, షేర్ మార్కెట్ పెట్టుబడులు లాంటివి లాభనష్టాల ఆధారంగా నడుస్తాయి. దేశంలో స్వల్ప మార్పులు వచ్చినా అవి వెనక్కి వెళ్లిపోతాయి. కానీ మన కార్మికులు పంపే డబ్బు అలా కాదు. ఇది అక్కడి కంపెనీల పనితీరు, కార్మికుల ఉపాధి, వేతనాల మీద ఆధారపడి ఉంటుంది. భారతదేశంలోని స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో దీనికి సంబంధం లేదు. గల్ఫ్ దేశాల్లోని ఉపాధి అవకాశాలు బాగున్నంత కాలం మన దేశానికి డబ్బు వస్తూనే ఉంటుంది. ఇది భారత రూపాయి విలువను కాపాడటానికి, దేశ ఆర్థిక సమతుల్యతను నిలబెట్టడానికి ఎంతో సహాయపడుతుంది.

### ముందుంది అసలైన ముప్పు

ప్రస్తుతానికి విదేశీ డబ్బు బాగానే వస్తున్నా భవిష్యత్తులో మాత్రం ఒక పెద్ద ముప్పు పొంచి ఉంది. పశ్చిమాసియాలో యుద్ధ లాంటి పరిస్థితులు సుదీర్ఘకాలం ఇలాగే కొనసాగితే సమస్యలు వస్తాయి. అక్కడి ఉపాధి రంగం దెబ్బతింటుంది. వలస కార్మికుల ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉంది. వారి సంపాదన తగ్గితే మన దేశానికి వచ్చే డబ్బు కూడా ఆటోమేటిక్‌గా తగ్గిపోతుంది. స్వల్పకాలిక సంక్షోభాలను తట్టుకున్నప్పటికీ.. రాబోయే రోజుల్లో విదేశీ లేబర్ మార్కెట్లో వచ్చే మార్పులను నిశితంగా గమనించడం చాలా అవసరమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కర్రుగాల్చి వాత

- ట్రంప్ పంతానికి సుప్రీం బ్రేక్!
- ఇకపైనా జన్మతః పౌరసత్వం హక్కు
- అమెరికా అధ్యక్షుడికి కోర్టు ఝలక్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయానికి అక్కడి సుప్రీం కోర్టు గట్టి చెంపదెబ్బ కొట్టింది. అమెరికా గడ్డపై జన్మించే పిల్లలకు ఇచ్చే 'జన్మతః పౌరసత్వం'... బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ నిబంధనను మార్చాలని ట్రంప్ ప్రయత్నించారు. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్న వారి పిల్లలకు అమెరికా పౌరసత్వం ఇవ్వకూడదని ఆయన ఒక వివాదాస్పద ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వును అమెరికా అత్యున్నత న్యాయస్థానం పూర్తిగా తిరస్కరించింది. ట్రంప్ తీసుకువచ్చిన ఆంక్షలను కొట్టివేస్తూ చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది.

### న్యాయస్థానంలో వీగిన ట్రంప్ వాదన

ఈ కేసు విచారణలో సుప్రీం కోర్టు కీలక తీర్పును వెలువరించింది. కోర్టులోని తొమ్మిది మంది న్యాయమూర్తులలో ఆరుగురు ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ముగ్గురు మాత్రమే ట్రంప్ ప్రతిపాదనను సమర్థించారు. దీంతో 63 మెజారిటీతో ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ చెల్లకుండా పోయింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం దేశ సరిహద్దుల్లో పుట్టిన ప్రతి ఒక్కరికీ పౌరసత్వం పొందే హక్కు ఉంటుంది. దశాబ్దాలుగా వస్తున్న ఈ సాంప్రదాయ చట్టాన్ని మార్చడం సాధ్యం కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

### వలసదారుల గొంతు నొక్కే కుట్ర

డొనాల్డ్ ట్రంప్ తన రెండో విడత పదవీ కాలం ప్రారంభమైన మొదటి రోజే ఈ ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికాలో వలసలను అరికట్టాలనే కఠినమైన విధానాలలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో తాత్కాలికంగా నివసించే వారి పిల్లలు ఆ దేశ పరిధిలోకి రారని, వారికి పౌరసత్వ అర్హత లేదని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. అయితే పూర్వం నల్లజాతీయులు, పూర్వపు బానిసలకు పౌరసత్వం కల్పించడానికి తెచ్చిన రాజ్యాంగ చట్టం చాలా స్పష్టంగా ఉందని, దానిని తప్పుగా అర్థం చేసుకోవడం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది.

### లక్షలాది మందికి ఊరట

ట్రంప్ వలస విధానాలపై సుప్రీం కోర్టుకు చేరిన మొదటి కేసు ఇదే కావడం గమనార్హం. ఇందులో ట్రంప్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అమెరికా గడ్డపై పుట్టిన ఎవరికైనా సహజంగానే పౌరసత్వ హక్కు లభిస్తుందని కోర్టు పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో అమెరికాలో నివసిస్తున్న లక్షలాది మంది వలసదారులు, విదేశీయులకు పెద్ద ఊరట లభించింది. తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్న ఎంతోమంది తల్లిదండ్రులు ఈ నిర్ణయంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ సర్కారుకు ఇది పెద్ద రాజకీయ పరాజయంగా నిలిచింది.

## ట్రంప్ ఘాటు స్పందన

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం దేశానికి ఎంతమాత్రం మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. కోర్టు తీర్పును అధిగమించడానికి రాజ్యాంగ సవరణలు అవసరం లేదని, పార్లమెంట్లో ప్రత్యేక చట్టం తీసుకురావడం ద్వారా ఈ సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. దేశానికి ఎంతో ఆర్థిక భారంగా మారిన, అన్యాయమైన ఈ పౌరసత్వ విధానాన్ని అంతం చేయడానికి కాంగ్రెస్ ఈ రోజు నుంచే పనులు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ చట్టాన్ని తీసుకురావడానికి దేశ అధ్యక్షుడిగా తన పూర్తి మద్దతు ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు.

### న్యాయశాఖ హెచ్చరికలు

ఈ వివాదంపై అమెరికా న్యాయశాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. పౌరసత్వ నిబంధనల్లోని లోపాలను ఆసరాగా చేసుకుని, కేవలం పిల్లలకు అమెరికా పౌరసత్వం కల్పించడమే లక్ష్యంగా సాగుతున్న 'బర్త్ టూరిజం' ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటువంటి అక్రమ పద్ధతులు దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తాయని, చట్టాన్ని ఉల్లంఘించే వారిని వదిలిపెట్టబోమని న్యాయశాఖ పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన కఠిన వలస విధానాల్లో భాగంగా వచ్చిన మొదటి పెద్ద కేసు ఇదే కావడం గమనార్హం. సుప్రీంకోర్టు తీర్పుతో ట్రంప్ ప్రభుత్వానికి తాత్కాలికంగా ఎదురుదెబ్బ తగిలినా, చట్టసభల ద్వారా దీనిని ఎదుర్కొంటామని వైట్ హౌస్ వర్గాలు చెబుతున్నాయి.

# పీఓకే తిరుగుబాటు!

- పాకిస్తాన్ వద్దు.. ఇండియా ముద్దు
- ఆక్రమిత కశ్మీర్‌లో ఉండలేం
- ఇండియా జోక్యం చేసుకోవాల్సిందే
- రగిలిపోతున్న రావాలాకోట్ ఈద్గా మైదానం




పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్, పీఓకేలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రావాలాకోట్ లోని ఈద్గా మైదానంలో వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఈ నిరసనలు ప్రారంభమై ఇప్పటికే 22 రోజులు దాటిపోయింది. ఈ ప్రాంతం అసలు పాకిస్తాన్ నియంత్రణలో లేదని, తమను బలవంతంగా అణచివేయలేరని అక్కడి నాయకులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తాము ఇకపై ఇస్లామాబాద్ ఆదేశాలను పాటించబోమని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే తాము భారతదేశంతో సంబంధాలను పెంచుకుంటామని, భారత్ జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు.

### ఆకలి కేకలు.. ఇంటర్నెట్ బంద్

అక్కడ ప్రజలు ఇంత పెద్ద ఎత్తున తిరుగుబాటు చేయడానికి అనేక బలమైన కారణాలు ఉన్నాయి. చాలా కాలంగా పీఓకే ప్రాంతంలో సరైన పాలన లేదు. విపరీతమైన ధరల పెరుగుదల, ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు నరకం చూస్తున్నారు. దీనికి తోడు జూన్ 5వ తేదీ నుండి అక్కడ ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేశారు. ప్రజల గొంతు నొక్కడానికి, ఈ నిరసనల వార్తలు ప్రపంచానికి తెలియకుండా చేయడానికి ప్రభుత్వం ఈ కుట్రకు తెరలేపింది. రెండు వారాలుగా ఆహార సరఫరాలను, నిత్యావసర వస్తువులను నిలిపివేసి ప్రజలను ఆకలితో అలమటించేలా చేస్తున్నారు.

### పాక్ ఆర్మీ చీఫ్‌కు వార్నింగ్

ఈ ప్రజా ఉద్యమానికి స్థానిక హక్కుల నాయకుడు సర్దార్ అమన్ ఖాన్ నాయకత్వం వహిస్తున్నారు. లైన్ ఆఫ్ కంట్రోల్, ఎల్ఓసీ సమీపంలో కూడా ప్రత్యేక ధర్నాలు జరుగుతున్నాయి. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ నిర్ణయాలను అక్కడి ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ఒక నియంత పాలనను తాము ఎంతమాత్రం సహించబోమని తేల్చి చెప్పారు. పాకిస్తాన్ కే పీఓకే అవసరం ఎక్కువని, తమకు పాకిస్తాన్ తో ఎలాంటి అవసరం లేదని అమన్ ఖాన్ స్పష్టం చేశారు. ఆహార ఆంక్షలు ఇలాగే కొనసాగితే.. సహాయం కోసం తాము భారత్ వైపు చూస్తామని హెచ్చరించారు. ఇది జరిగితే ప్రాంతీయ రాజకీయాలు పూర్తిగా మారిపోతాయి.

### ప్రపంచవ్యాప్తంగా మద్దతు.. కొనసాగుతున్న పోరాటం

ఈ పోరాటం కేవలం పీఓకే ప్రాంతానికే పరిమితం కాలేదు. విదేశాలలో నివసిస్తున్న కశ్మీరీ ప్రజలు కూడా ఈ ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నారు. వివిధ దేశాల్లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయాల వెలుపల నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ముజఫరాబాద్ తో పాటు మొత్తం ప్రాంతంలో తమ రాజకీయ లక్ష్యాలు నెరవేరే వరకు ఈ సుదీర్ఘ పోరాటం ఆగే ప్రసక్తే లేదని ఉద్యమకారులు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలు ఇస్లామాబాద్ పాలకులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. భారతదేశ సహాయం కోరతామనే హెచ్చరిక పాక్ ప్రభుత్వంలో తీవ్ర వణుకు పుట్టిస్తోంది.

# దేవుడి భూములకు పక్కా రక్షణ!

- ఆలయ హక్కులపై రేవంత్ ఆదేశం
- యాజమాన్య హక్కులు ఆలయాలకే సొంతం



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ఒక కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ స్థలాలు భవిష్యత్తులో ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఆలయ భూముల పరిరక్షణతో పాటు భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే భూమిని ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం తేల్చి చెప్పారు.

### తిరుమల తరహా విధానం అమలు

ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు.

### దాతల భాగస్వామ్యం.. నిధుల విడుదల

కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని సీఎం చెప్పారు. వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

### నివేదిక సమర్పణకు వారం గడువు

యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, వాటి నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని అధికారులకు తుది గడువు విధించారు. ఆలయ పనుల్లో ఎక్కడా పారదర్శకత లోపించకూడదని హితవు పలికారు. తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్టను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధుల కొరత రాకుండా చూసుకుంటామని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# చీరాలలో అరకు కాఫీ అవుట్‌లెట్ ప్రారంభం



**చీరాల, జూన్ 30(నాదేశం):** స్థానిక దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అరకు కాఫీ విక్రయ కేంద్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన రైతుల శ్రమను, వారు పండించిన పంటను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని చీరాల నడిబొడ్డున ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మన ప్రాంతంలో పండే కాఫీని మనమే ఆదరించాలని, దీని ద్వారా గిరిజన రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా మొదటి కేంద్రం ప్రారంభం కాగా, ఇప్పుడు చీరాలలో ఈ సరికొత్త అవుట్ లెట్ ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలోని ఉండే ఆటో కార్మికులు, ముఠా కార్మికులు సాధారణ ప్రజలకు ఈ అరకు కాఫీ షాప్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

# శ్రామికుడి విజయప్రస్థానం

- అంకితభావానికి దక్కిన గౌరవం
- మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం




ఏలేశ్వరం ఆర్టీసీ డిపోలో ఒక సాధారణ కండక్టర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన కే. త్రిమూర్తులు అంచెలంచెలుగా పదోన్నతులు పొందారు. తన అద్భుతమైన పనితీరుతో అసిస్టెంట్ డిపో కంట్రోలర్ స్థాయికి ఎదిగి సుమారు 39 సంవత్సరాలపాటు ఆర్టీసీ సంస్థకు విశిష్ట సేవలు అందించిన ఆయన శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ కన్వెన్షన్ హాల్లో ఒక ఘనమైన వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### యువ ఉద్యోగులకు చక్కని ఆదర్శం

ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఏలేశ్వరం డిపో మేనేజర్ జి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, విధి పట్ల అంకితభావం ఉంటే ఎలాంటి ఉన్నత స్థానానికైనా చేరుకోవచ్చని త్రిమూర్తులు నిరూపించారని కొనియాడారు. సంస్థ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ సహోద్యోగులతో కలిసి పనిచేస్తూ ఐక్యత భావాన్ని పెంపొందించడంలో ఆయన విశేష పాత్ర పోషించారని పేర్కొన్నారు. త్రిమూర్తులు సౌమ్య స్వభావం, సేవా దృక్పథం అందరి అభిమానాన్ని సంపాదించాయని మిగతా వక్తలు తెలిపారు.

### జీవిత భాగస్వామితో కలిసి ఘన సన్మానం

కార్యక్రమం ముగింపులో కే. త్రిమూర్తులు, వారి సతీమణిని శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ సహచరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా చైర్మన్ కే. శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, యూనియన్ సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీడ్కోలు పలికారు.

ప్రభాత కిరణమ్

4
GENERAL NEWS
బుధవారం 01 జులై 2026
www.prabhathakiranam.com

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు బాధ్యతలు



రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, ఐఏఎస్ మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఐఏఎస్ ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, విమానాలు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవనుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన 'ఏరోమార్ట్ హైదరాబాద్ 2026' సదస్సులో ఆయన మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల విడిభాగాలు, ఎఫ్16 యుద్ధ విమానాల రెక్కలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని వెల్లడించారు. "మేడ్ ఇన్ తెలంగాణ" అనే ముద్ర ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, ఈ రంగం గత కొన్నేళ్లుగా 30 శాతం వృద్ధిని నమోదు చేసిందని మంత్రి తెలిపారు.



గత ఏడాది ఏరోస్పేస్ ఎగుమతులు 103 శాతం పెరిగి, ఔషధ రంగాన్ని సైతం అధిగమించడం చారిత్రాత్మకమని కొనియాడారు. డీఆర్‌డీఓ, రీసెర్చ్ సెంటర్లు ఒకే నగరంలో ఉండటం వల్ల హైదరాబాద్ పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారిందని, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, కొత్తగూడెం విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్ రానుందని మంత్రి స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ

**భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన**

హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యా సంస్కరణలు, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు మరియు ఐటీఐల ఆధునికీకరణ గురించి సీఎం వివరించారు. చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలని, అలాగే హైదరాబాద్‌లో సమగ్ర డేటా సెంటర్, ఏఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని మిట్టల్‌కు సీఎం సూచించారు. హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్‌క్వార్టర్‌గా భావిస్తున్నామని సునీల్ మిట్టల్ పేర్కొన్నారు. డేటా సెంటర్ల కెపాసిటీని, ఫైబర్ కనెక్టివిటీని పెంచేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేశారు.



ఏఐ చిత్రం

# పాలనలో ట్రెండ్ సెట్..

## ప్రజలకు చేరువయ్యే మైండ్ సెట్

### చంద్రబాబు ఐదు రోజుల జిల్లాల ప్రగతి యాత్ర

- అభివృద్ధి సంక్షేమాలే లక్ష్యంగా క్షేత్రస్థాయి పర్యటనలు
- నెల్లూరులో పెన్షన్ల పంపిణీ, భారీ పెట్టుబడుల డీల్
- రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు సరికొత్త శ్రీకారం
- సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల బస
- ఏడు పదుల వయసులోనూ అదే దూకుడు రాజకీయాలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి నుంచి ఐదు రోజుల పాటు జిల్లాల 'ప్రగతి యాత్ర'కు శ్రీకారం చుట్టారు. ఏడు పదుల వయసులోనూ అదే పాత దూకుడుతో, సచివాలయాల ఫైళ్లకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పాలనే లక్ష్యంగా ఆయన కదలనున్నారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పెట్టుబడులు, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సాధారణ టూర్లకు భిన్నంగా, చంద్రబాబు ఈసారి పర్యటించే జిల్లాల్లోనే రాత్రి బస చేస్తూ 'ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్'కు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. తొలిరోజు నేడు నెల్లూరు జిల్లాలో పింఛన్ల పంపిణీతో పాటు, శ్రీ సిటీలో రూ.750 కోట్ల హీరో మోటోకార్ప్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. తద్వారా సంక్షేమం-పెట్టుబడుల ద్విముఖ వ్యూహాన్ని చాటనున్నారు. ఈ యాత్రలో అత్యంత కీలక ఘట్టంగా కడప జిల్లా జమ్మలమడుగులో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టి సీమ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేయనున్నారు. అనంతరం సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల పాటు బస చేసి స్థానిక ప్రగతిని స్వయంగా పర్యవేక్షించనున్నారు. 'స్వర్ణాంధ్ర' లక్ష్య సాధనలో ఈ ఐదు రోజుల యాత్ర రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త దిశను చూపనుంది.




# విజ్ఞాన సాధికారత..

## దేశ ప్రగతిలో యువత పాత్ర

» గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం
» రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిశా నిర్దేశం

# ఖనిజ విప్లవం

- రాష్ట్రవ్యాప్తంగా మినరల్ మ్యాపింగ్
- ఏపీ సంపదకు చంద్రబాబు ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో దాగి ఉన్న విలువైన ఖనిజ నిల్వలను గుర్తించడానికి వెంటనే మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు వ్యూహాత్మక లోహాలు లభించే అన్ని ప్రాంతాలను స్పష్టంగా మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికితీసే ప్రతి ఖనిజానికి విలువ జోడించేలా... (5లో..)



# కడప ఉక్కు పరిశ్రమకు ముహూర్తం ఖరారు

**రాయలసీమ కలల సాకారానికి చంద్రబాబు అడుగులు**


ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ఈ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నంద్యాల ఎంపీ శబరి వెల్లడించారు. కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో మునుపటి ప్రభుత్వం ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో కనీసం కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేకపోయిందని ఆమె విమర్శించారు. (5లో..)

# కోట్ల రూపాయల బస్టాండ్ చీకటి అడ్డా..!?

- ప్రారంభానికి నోచుకోని రవాణా ప్రాంగణం
- ప్రజాధనం వృథాతో ఎవరికీ ప్రయోజనం?
- కలవరపెడుతోన్న నిర్లక్ష్యపు వ్యవహారం!
- అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా బస్టాండ్




రాయలసీమలో బంగారు నగరంగా పేరొందిన ప్రొద్దుటూరుకు ఆధునిక బస్టాండ్ మరో గుర్తింపుగా నిలవాల్సింది. కానీ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఆ భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో ఇప్పుడు తీవ్ర విమర్శలకు కేంద్రంగా మారింది. ప్రయాణికుల కోసం నిర్మించిన ప్రజా వేదిక ఖాళీగా ఉండిపోవడం, రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆశ్రయంగా మారుతోందన్న స్థానికుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నిర్వహణ లేక అపరిశుభ్ర పరిస్థితులు నెలకొనడం, భద్రత లేకపోవడం, ప్రభుత్వ ఆస్తి నిర్లక్ష్యానికి గురవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు అధికారులు ప్రతిరోజూ ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే మిగిలిన పనులు పూర్తి చేసి బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అప్పటివరకు భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ఈ ఆధునిక బస్టాండ్ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందా? లేక నిర్లక్ష్యానికి నిదర్శనంగా మిగిలిపోతుందా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రొద్దుటూరులో ప్రధాన చర్చగా మారింది.




# రక్తసిక్తమైన ప్రేమకథ

**ఊపిరి ఆపేసే క్రైమ్ థ్రిల్లర్ లోహగఢ్ మిస్టరీలో ఊహకందని మలుపులు**

ఒకవైపు భానుడి భగభగలు.. మరోవైపు లోహగఢ్ కోటపై చావు నీడలా వెంటాడుతున్న హూడీ ధరించిన కిల్లర్. కాబోయే భర్తను లోయలోకి నెట్టేసిన క్రూరమైన ప్రేమికులు, వారి అబద్ధాలను ఛేదించడానికి పోలీసులు సిద్ధం చేసిన 'గేట్ అనాలసిస్' నడక పరీక్ష ఈ కథలో ఒక మైండ్ బ్లోయింగ్ సీన్ అయితే, ఇప్పుడు వెలుగులోకి వచ్చిన మరో ట్విస్ట్ థ్రిల్ ను పీక్స్‌కు తీసుకెళ్లింది. ఈ దారుణ హత్య వెనుక కేవలం ఇద్దరే లేరు, ఒక లవ్ స్టోరీ ముసుగులో సాగిన సుదీర్ఘమైన స్కెచ్ ఉందనే అనుమానాలు రేగుతున్నాయి. సొంత అక్క లవ్ ట్రాక్, కాబోయే బావమరిది మౌనం వెనుక దాగున్న రహస్యాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. నిశ్శబ్దంగా సాగిన ఈ పెను కుట్రలో డ్రైవర్ ఇచ్చిన సాక్ష్యం, చినిగిన పాస్‌పోర్ట్ కథలు వెండితెరపై వచ్చే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. ఊపిరి బిగబట్టే ఈ మలుపుల మధ్య అసలు సూత్రధారులు ఎందరు, ఈ రక్తపాతంలో ఎవరెవరి పాత్రలు ఉన్నాయనే నిజాలు త్వరలోనే మైండ్ బ్లాంక్ చేయనున్నాయి.

# రాజకీయ చదరంగంలో మామిడి రైతు


ఏఐ చిత్రం

రాష్ట్రంలో మామిడి ధరల వివాదం ఇప్పుడు తీవ్ర రాజకీయ రంగు పులుముకుంది. అటు ప్రతిపక్ష వైసీపీ రోడ్లపైకి వచ్చి కూటమి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతుంటే, ఇటు అధికార టీడీపీ కౌంటర్ ఇస్తూ రైతులకు అండగా ఉన్నామంటూ హామీలు ఇస్తోంది. కనీస గిట్టుబాటు ధర రాక సీఎం సొంత జిల్లాలోనే రైతుల కళ్లల్లో రక్తం చిందుతోందని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. దీనికి భిన్నంగా, గత ప్రభుత్వం కంటే తామే మెరుగ్గా ఆదుకుంటున్నామని, ఫ్యాక్టరీలు ధరలు తగ్గించి రాజకీయం చేస్తే సహించేది లేదని అధికార పక్షం హెచ్చరిస్తోంది. ఈ రెండు పార్టీల మాటల యుద్ధం, సవాళ్ల మధ్య సగటు మామిడి రైతు మాత్రం పెట్టుబడులు రాక, దళారుల చేతిలో నలిగిపోతూ దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.



# గిట్టుబాటు ధర కోసం వైసీపీ ఆందోళన

**మామిడి రైతులకు మద్దతుగా భారీ నిరసన**

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన చేపట్టింది. కడప, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. మాజీ మంత్రి నారాయణస్వామి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సహా పలువురు నేతలు రైతులకు సంఘీభావం ప్రకటించారు.

**ప్రభుత్వంపై విమర్శలు**

కూటమి ప్రభుత్వ పాలనలో మామిడి రైతులకు న్యాయం జరగడం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. కేంద్రం ప్రకటించిన కిలోకు రూ.17.50 కనీస గిట్టుబాటు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీల వద్ద టోకెన్ విధానం, తక్కువ ధరలు, సరుకు తిరస్కరణ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ వెనక్కి తగ్గబోమని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేశారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర, పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం అండగా ఉంటుంది

**మామిడి రైతులకు మంత్రి హామీ**

చిత్తూరు జిల్లా మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది కూడా మామిడి కొనుగోళ్లలో రైతులకు నష్టం రాకుండా చూస్తామని చెప్పారు. గత ఏడాది లాగే ఈసారి కూడా ప్రతి కేజీకి నాలుగు రూపాయలు ముందస్తుగా చెల్లిస్తూ కొనుగోళ్లు జరుపుతామని హామీ ఇచ్చారు. (వివరాలు 5లో..)




# హోం మంత్రి వ్యాఖ్యలు



- వెనక్కి తగ్గనన్న మాజీ మంత్రి
- కమిషన్ విచారణకు హాజరు
- ఒక వ్యక్తిపైనే విమర్శలన్నీ

మహిళలపై ఎలాంటి అభ్యంతకర వ్యాఖ్యలు చేయలేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తనను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిన ఒక వ్యక్తిపై మాత్రమే తాను విమర్శలు చేశానని ఉద్ఘాటించారు. తన వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. ప్రతి మనిషికి ఒక సహనం ఉంటుందని, దానిని కోల్పోయేలా ఎదుటివారు మాట్లాడినప్పుడే తాను స్పందించానని చెప్పారు.
(వివరాలు 5లో..)




# ఏపీకి రెండు ఆడపులులు

- మహారాష్ట్ర సీఎం అంగీకారం
- డిప్యూటీ సీఎంతో చర్చల్లో ప్రతిపాదన
- వన్యప్రాణుల రక్షణకు కొత్త అడుగు



# ఏపీకి రెండు ఆడపులులు

- ఇస్తాని మహా సీఎం అంగీకారం
- డిప్యూటీ సీఎంతో చర్చల్లో ప్రతిపాదన
- వన్యప్రాణుల రక్షణకు కొత్త అడుగు



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముంబయిలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా వన్యప్రాణుల సంరక్షణ, అడవుల అభివృద్ధిపై ఇరు రాష్ట్రాల మధ్య సరికొత్త అవగాహన కుదిరింది. భవిష్యత్తులో ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి మరింత సహకరించుకోవాలని ఇరుపక్షాలు ఒక నిర్ణయానికి వచ్చాయి.

### ఆడపులుల కొరత, జన్యుపరమైన సమస్యలు

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అక్కడ ఉన్న పులులలో జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ తీవ్రమైన సమస్యను అధిగమించడానికి, పులుల సంఖ్యను మళ్లీ పటిష్టంగా పునరుద్ధరించడానికి మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు తెలిపారు. వన్యప్రాణుల సమతుల్యతను కాపాడటం ఉమ్మడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

### మహారాష్ట్ర ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థనకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారు. ఏపీకి రెండు ఆడ పులులను ఇచ్చేందుకు ఆయన అంగీకారం తెలిపారు. ఈ గొప్ప సహకారానికి పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఈ నిర్ణయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వం అండగా ఉంటుంది

- మామిడి రైతులకు మంత్రి హామీ



చిత్తూరు జిల్లా మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరావతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది కూడా మామిడి కొనుగోళ్లలో రైతులకు నష్టం రాకుండా చూస్తామని చెప్పారు. గత ఏడాది లాగే ఈసారి కూడా ప్రతి కేజీకి నాలుగు రూపాయలు ముందస్తుగా చెల్లిస్తూ కొనుగోళ్లు జరుపుతామని హామీ ఇచ్చారు.

### పంట దిగుబడితో పెరిగిన ఒత్తిడి

ఈ సంవత్సరం మామిడి పంట దిగుబడి చాలా ఎక్కువగా వచ్చింది. దీనివల్ల కొనుగోలు కేంద్రాలపై తాత్కాలికంగా కొంత ఒత్తిడి పెరిగిందని మంత్రి వివరించారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సుమారు 190 కోట్ల రూపాయలు చెల్లించిందని గుర్తుచేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ఆయన చెప్పారు. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

మామిడి కొనుగోళ్లలో జాప్యం చేస్తే ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా వైసీపీ సానుభూతిపరుల కంపెనీలు కొనుగోళ్లలో నిర్లక్ష్యం చూపిస్తే ఊరుకునేది లేదన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన ఫ్యాక్టరీలు రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల కష్టాలను చూసి వైసీపీ నాయకులు రాజకీయం చేయడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గట్టిగా బుద్ధి చెప్పారు.




## విజ్ఞాన సాధికారత.. దేశ ప్రగతిలో

# యువత పాత్ర

- గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిశా నిర్దేశం

దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ వేడుకకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను అని గుర్తుచేసుకున్నారు. ఇంతమంది గిరిజన యువతీ యువకులకు పట్టాలు అందించడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు.

### వెనుకబడిన వర్గాలకు అండగా నిలవాలి

ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను అస్సలు మరవకూడదని రాష్ట్రపతి విద్యార్థులకు హితవు పలికారు. యువత కేవలం తాము జీవితంలో ముందుకు వెళ్లడమే కాకుండా వెనక్కి తిరిగి చూసి అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత' లక్ష్య సాధన దిశగా యువత అడుగులు వేయాలన్నారు. దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

### సామాజిక మార్పే అసలైన చదువు

ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ వేడుకలో వ్యాఖ్యానించారు. నాణ్యమైన చదువు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. స్వయంకృషితో అత్యున్నత రాష్ట్రపతి పదవికి ఎదిగిన ద్రౌపది ముర్ము అందరికీ రోల్ మోడల్ అని కొనియాడారు. ఈ సమాజంలో అన్ని ప్రాంతాలు సమంగా అభివృద్ధి చెందితేనే దేశ కల సాకారం అవుతుందన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో మొత్తం 13 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు.

# హోం మంత్రి వ్యాఖ్యలు

- వెనక్కి తగ్గనన్న మాజీ మంత్రి
- కమిషన్ విచారణకు హాజరు
- ఒక వ్యక్తిపైనే విమర్శలన్నీ



మహిళలపై ఎలాంటి అభ్యంతకర వ్యాఖ్యలు చేయలేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తనను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిన ఒక వ్యక్తిపై మాత్రమే తాను విమర్శలు చేశానని ఉద్ఘాటించారు. తన వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. ప్రతి మనిషికి ఒక సహనం ఉంటుందని, దానిని కోల్పోయేలా ఎదుటివారు మాట్లాడినప్పుడే తాను స్పందించానని చెప్పారు. తన వ్యాఖ్యలను యావత్ మహిళా లోకానికి ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని తెలుగుదేశం పార్టీ నేతలు చూస్తున్నారని, ఆ ప్రయత్నంలో వారే నవ్వులపాలయ్యారని ఎద్దేవా చేశారు.

### వివరణ ఇచ్చాను, కట్టుబడి ఉన్నాను

మహిళా కమిషన్‌తో భేటీ అనంతరం అమర్నాథ్ మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తాము చేసిన కామెంట్స్ కేవలం పొలిటికల్ సెటైర్ మాత్రమేనని కమిషన్‌కు వివరించినట్లు చెప్పారు. హోంమంత్రి అనిత గతంలో తమ పార్టీ నేతలపై అనేకసార్లు ఇష్టానుసారం మాట్లాడారని గుర్తుచేశారు. కూటమి నేతలు ఊహించుకుంటున్న వాటికి తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వ్యవస్థలపై ఉన్న గౌరవంతోనే తాను విచారణకు హాజరయ్యానని, రాజకీయంగా ప్రత్యర్థులు వంద మాటలు అంటుంటే తాము ఒక్క మాట అంటే ఎందుకు బాధపడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలపై హోంశాఖ ఎందుకు మాట్లాడటం లేదని అమర్నాథ్ నిలదీశారు. సాయికృష్ణ తల్లి ఆవేదనపై, ఉప్పాల హారికపై జరిగిన దాడిపై మహిళా కమిషన్ ఎందుకు స్పందించడం లేదని అడిగారు.

# అశోకగజపతి భూములు వెనక్కి ఇవ్వండి

- అధికారులకు మంత్రి కొండపల్లి ఆదేశం

మాజీ కేంద్ర మంత్రి, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు చెందిన స్థలాన్ని తిరిగి ఆయనకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయనగరం నగరం నడిబొడ్డున ఉన్న ఆయన విలువైన ప్రైవేటు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా చూపి, రికార్డులు తారుమారు చేసి పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం అత్యంత దురదృష్టకరమని మంత్రి విమర్శించారు. నిజాయతీకి నిలువెత్తు నిదర్శనమైన అశోక్ గజపతిరాజుపై గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడమే కాకుండా భూమిని కూడా కబ్జా చేసిందని మండిపడ్డారు. పూసపాటి వంశీయుల ఆస్తులపై ఆ సంస్థానాధీశులకే పూర్తి హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. రికార్డులను పరిశీలించి వెంటనే ఆ స్థలాన్ని అప్పగించాలని, భూమిని రాజకీయ పార్టీకి కట్టబెట్టిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు.

# ఖనిజ విప్లవం

- రాష్ట్రవ్యాప్తంగా మినరల్ మ్యాపింగ్
- ఏపీ సంపదకు చంద్రబాబు ప్రణాళిక



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో దాగి ఉన్న విలువైన ఖనిజ నిల్వలను గుర్తించడానికి వెంటనే మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్ తో పాటు వ్యూహాత్మక లోహాలు లభించే అన్ని ప్రాంతాలను స్పష్టంగా మ్యాపింగ్ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికితీసే ప్రతి ఖనిజానికి విలువ జోడించేలా... వ్యాల్యూ అడిషన్ ప్రాసెసింగ్ ప్రక్రియలను ఇక్కడే నిర్వహించడంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. దీనివల్ల రాష్ట్ర ఖనిజ సంపద మార్కెట్ విలువ గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు.

### విలువ జోడింపుతో భారీ ఆదాయం

బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యుమినా వంటి ఖనిజాలను కేవలం ముడి రూపంలో కాకుండా శుద్ధి చేసి విక్రయించడం ద్వారా గరిష్ట ఆదాయాన్ని ఆర్జించవచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజ ఆదాయం వల్లే రెవెన్యూ మిగులు సాధించాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ ఖనిజాల విలువ జోడింపు కోసం ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ రాష్ట్రాలలో లభించే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్ పై ఒక ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి హై వాల్యూ నిల్వలపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.

### బంగారు నిల్వలపై ప్రత్యేక అధ్యయనం

రాష్ట్రంలో జొన్నగిరితో పాటు చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద ఉన్న బంగారం నిల్వలపై, మిగిలిన ఇతర బ్లాకులపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాలలో ఇప్పటికే రకరకాల బల్క్ ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా వచ్చే ఆదాయంలో 18 శాతం వృద్ధి నమోదైనట్లు వారు వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ గనుల తవ్వకాలను నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని ఆదేశించారు.

### ఉచిత ఇసుకపై సాంకేతిక నిఘా

ప్రజల సంక్షేమం కోసమే ఇసుకపై వచ్చే దాదాపు వెయ్యి కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఉచిత ఇసుక సామాన్యులకు సద్వినియోగం అయ్యేలా తవ్వకాలు, సరఫరాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా నిరంతరం విశ్లేషించాలని ఆదేశించారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ అమర్చాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కడప ఉక్కు పరిశ్రమకు ముహూర్తం ఖరారు

- రాయలసీమ కలల సాకారానికి చంద్రబాబు అడుగులు

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ఈ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నంద్యాల ఎంపీ శబరి వెల్లడించారు. కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆమె పేర్కొన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో మునుపటి ప్రభుత్వం ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో కనీసం కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేకపోయిందని ఆమె విమర్శించారు.


### వెనుకబడిన ముద్రను చెరిపేసేలా ప్రణాళిక

గతంలో 2018 డిసెంబర్ 27న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కడప స్టీల్ ప్లాంట్‌కు తొలిసారి శంకుస్థాపన చేశారని ఎంపీ శబరి గుర్తుచేశారు. రాయలసీమపై ఉన్న వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను పూర్తిగా తొలగించి, దీనిని 'రాయల్ సీమ'గా తీర్చిదిద్దడమే ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. హార్టికల్చర్, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల హబ్‌గా ఈ ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గట్టి కార్యాచరణ చేపట్టిందన్నారు. గత పాలకులు కేవలం ఎన్నికల ముందే కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు.



### వేలాది మంది యువతకు ఉపాధి భరోసా

కడప స్టీల్ ప్లాంట్ అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది మంది స్థానిక యువతకు ఉపాధిని ఇచ్చే గొప్ప ప్రాజెక్టు అని ఎంపీ శబరి వివరించారు. అనేక కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకే విద్యుత్, నీటి సరఫరా, రహదారులు వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేసిన తర్వాతే పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 800 కంపెనీలు భారీ పెట్టుబడులతో ముందుకొచ్చాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



# తిరుపతిలో ఎలుగుబంటి కలకలం

- మూడు పిల్లలతో కలిసి జనావాసంలోకి
- మొన్న చిరుత, నేడు ఎలుగుబంటి
- ఆందోళనలో స్థానిక ప్రజానీకం

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి నగర సరిహద్దు ప్రాంతాలలో వన్యప్రాణుల సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా తిరుమల నగర్ తెలుగు గంగ వాటర్ హౌస్ పైభాగంలో ఓ ఎలుగుబంటి తన మూడు పిల్లలతో కలిసి స్వేచ్ఛగా తిరుగుతూ స్థానికుల కంటపడింది. నివాస ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఈ క్రూర జంతువు సంచరిస్తూ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఏం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వెంటనే స్థానిక ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

### ఆహారం కోసం అడవి దాటి

శేషచలం కొండల అంచున ఉండే తిరుమల నగర్, బీటీఆర్ కాలనీ, కృష్ణవేణి యాదవ్ కాలనీ పరిసర ప్రాంతాలలో గత రెండు నెలలుగా ఎలుగుబంట్లు తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. అడవిలో ఆహారం, నీటి కొరత ఏర్పడటం వల్లే ఇవి జనావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ఎలుగుబంట్ల గుంపు కాలనీ వీధుల్లోకి వస్తే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు.

### చిరుత పులి భయం

నగరవాసులను కేవలం ఎలుగుబంట్లు మాత్రమే కాకుండా క్రూర జంతువైన చిరుత పులి కూడా వణికిస్తోంది. కేవలం రెండు వారాల క్రితమే తిరుమల నగర్‌కు సమీపంలోని ఉపాధ్యాయనగర్ వద్ద ఒక చిరుత పులి సంచరిస్తూ కనిపించింది. వరుసగా చిరుతలు, ఎలుగుబంట్లు నగరంలోకి ప్రవేశిస్తుండటంతో అటవీ సరిహద్దు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఈ క్రూర జంతువులను బంధించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు లేవు

అరుణాచల్ ప్రదేశ్‌లోని తక్సింగ్ సరిహద్దుల్లో చైనా సైన్యం చొరబడి, సైనిక శిబిరాలు మరియు రోడ్లను నిర్మించిందంటూ కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలను భారత సైన్యం తీవ్రంగా ఖండించింది. ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవన్నీ ఆధారాలు లేని అసత్య ప్రచారాలని స్పష్టం చేసింది. స్థానిక 'నాహ్ వెల్ఫేర్ సొసైటీ' గతంలో ప్రభుత్వానికి ఇచ్చిన ఒక వినతి పత్రాన్ని ఆధారంగా చేసుకుని ఈ కథనాలు వచ్చాయి. గత 1015 ఏళ్లుగా చైనా తమ సాంప్రదాయక ప్రాంతాలను ఆక్రమిస్తోందని ఆ సొసైటీ ఆరోపించింది. అయితే, ఇటీవలే బీజింగ్‌లో భారత్‌చైనా సరిహద్దు వ్యవహారాలపై ఇరుదేశాల మధ్య సానుకూల చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని ఆర్మీ భరోసా ఇచ్చింది.

## డెలివరీ బాయ్

# వివాదం

- హీరో అఖిల్ రాజ్ వివరణ


డెలివరీ బాయ్‌తో జరిగిన వివాదంపై 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా హీరో అఖిల్ రాజ్ స్పందిస్తూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక వివరణాత్మక వీడియోను పోస్ట్ చేశారు. కొండాపూర్‌లోని తమ ఎదురు బిల్డింగ్ వారు తప్పుగా తమ ఇంటి అడ్రస్ ఇవ్వడం వల్లే ఈ సమస్య వచ్చిందని ఆయన పేర్కొన్నారు. డెలివరీ బాయ్ పొరపాటున ఇచ్చిన పార్సిల్‌ను తమ ఇంట్లో వారే ఆర్డర్ చేశారనుకుని తన తల్లి ఓపెన్ చేసిందని చెప్పారు. ఆ తర్వాత పార్సిల్ కోసం తిరిగి వచ్చిన డెలివరీ బాయ్ మద్యం మత్తులో తన తల్లిని ఉద్దేశించి "ఫ్రీగా వస్తే తీసుకుంటారా?" అంటూ దారుణంగా మాట్లాడాడని అఖిల్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా అదే అడ్రస్ తప్పు వల్ల తమ ఇంటికి సిగరెట్లు వచ్చాయని తెలిపారు. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని ఖండిస్తూ, ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హీరో వెల్లడించారు.

## మహిళల క్రీడల్లో

# ట్రాన్స్‌జెండర్లకు చెక్

- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు

అమెరికాలో విద్యాసంస్థల్లో నిర్వహించే మహిళల, బాలికల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్ అథ్లెట్లు పాల్గొనకుండా పలు రాష్ట్రాలు విధించిన నిషేధాన్ని ఆ దేశ సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ తీర్పుతో రిపబ్లికన్ పార్టీ నేతృత్వంలోని ఐడహో, వెస్ట్ వర్జీనియాతో పాటు మరో రెండు డజన్లకు పైగా రాష్ట్రాలకు పెద్ద ఉపశమనం లభించింది. తాజా తీర్పు ప్రకారం, అథ్లెట్లు తమ 'లింగ గుర్తింపు' ఆధారంగా కాకుండా, పుట్టినప్పుడు నమోదైన 'జీవసంబంధిత లింగం' ఆధారంగానే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. పురుష శారీరక దారుఢ్యం ఉన్నవారు మహిళల విభాగంలో పోటీ పడటం వల్ల అసలైన మహిళా క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందన్న వాదనతో కోర్టు ఏకీభవించింది. కన్జర్వేటివ్ వర్గాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, మానవ హక్కుల సంఘాలు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.



# గమ్యం చేరని ప్రయాణాలు

- కుటుంబాల జీవితాలు చిద్రమ్

రోడ్లపై ప్రతి రోజు జరుగుతున్న ప్రమాదాలు కేవలం గణాంకాలు కావు.. ఎన్నో కుటుంబాల జీవితాలను శాశ్వతంగా మార్చేస్తున్న విషాద గాథలు. విజయవాడ హైవేపై టైరు పేలడంతో బస్సు లారీని ఢీకొట్టడం, హైదరాబాద్‌లో మద్యం మత్తులో బొలెరో ఢీకొట్టడంతో కొడుకు కళ్ల ముందే తల్లి ప్రాణాలు కోల్పోవడం, కృష్ణా జిల్లాలో కంటైనర్‌ట్యాంకర్ మధ్య కారు నలిగి చిన్నారితో సహా ముగ్గురు మరణించడం, ముంబైలో స్కూల్ బస్సుపై చెట్టు కూలి ఓ విద్యార్థి మృతి చెందడం వంటి ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి. నిర్లక్ష్యం, మద్యం మత్తు, యాంత్రిక లోపాలు, అనుకోని ప్రమాదాలు... కారణాలు వేరైనా, చివరికి కన్నీళ్లు మిగిలేది మాత్రం కుటుంబాలకే. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగియాలంటే అప్రమత్తతే అసలైన రక్షణ.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి నుంచి ఐదు రోజుల పాటు జిల్లాల 'ప్రగతి యాత్ర'కు శ్రీకారం చుట్టారు. ఏడు పదుల వయసులోనూ అదే పాత దూకుడుతో, సచివాలయాల ఫైళ్లకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పాలనే లక్ష్యంగా ఆయన కదలనున్నారు. సంక్షేమం, అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పెట్టుబడులు, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సాధారణ టూర్లకు భిన్నంగా, చంద్రబాబు ఈసారి పర్యటించే జిల్లాల్లోనే రాత్రి బస చేస్తూ 'ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్'కు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. తొలిరోజు నేడు నెల్లూరు జిల్లాలో పింఛన్ల పంపిణీతో పాటు, శ్రీ సిటీలో రూ.750 కోట్ల హీరో మోటోకార్ప్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. తద్వారా సంక్షేమం-పెట్టుబడుల ద్విముఖ వ్యూహాన్ని చాటనున్నారు. ఈ యాత్రలో అత్యంత కీలక ఘట్టంగా కడప జిల్లా జమ్మలమడుగులో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టి సీమ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేయనున్నారు. అనంతరం సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల పాటు బస చేసి స్థానిక ప్రగతిని స్వయంగా పర్యవేక్షించనున్నారు. 'స్వర్ణాంధ్ర' లక్ష్య సాధనలో ఈ ఐదు రోజుల యాత్ర రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సరికొత్త దిశను చూపనుంది.



## చంద్రబాబు ఐదు రోజుల జిల్లాల ప్రగతి యాత్ర

# పాలనలో ట్రెండ్ సెట్..

## ప్రజలకు చేరువయ్యే మైండ్ సెట్

- అభివృద్ధి సంక్షేమాలే లక్ష్యంగా క్షేత్రస్థాయి పర్యటనలు
- నెల్లూరులో పెన్షన్ల పంపిణీ, భారీ పెట్టుబడుల డీల్
- రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు సరికొత్త శ్రీకారం
- సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల బస
- ఏడు పదుల వయసులోనూ అదే దూకుడు రాజకీయాలు

చాలా మంది నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్య కనిపిస్తారు. మరికొందరు అధికార యంత్రాంగాన్నే పూర్తిగా నమ్ముకుని పరిపాలన సాగిస్తారు. కానీ నారా చంద్రబాబు నాయుడు పని తీరు మాత్రం అప్పటికీ, ఇప్పటికీ... ఎప్పటికీ భిన్నంగానే ఉంటుంది. ఆయనకు పరిపాలన అంటే కేవలం సచివాలయంలో ఫైళ్లపై సంతకాలు చేయడం కాదు. ప్రాజెక్టులు ఎలా సాగుతున్నాయి? ప్రజలకు సంక్షేమం ఎలా చేరుతోంది? పెట్టుబడులు ఎంతవరకు వస్తున్నాయి? అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను అందుకుంటున్నారా? ఇదంతా ఆయన దిన చర్యలో భాగం. నేటి నుంచి ఐదు రోజుల జిల్లాల పర్యటన... ఆటవిడుపు కానే కాదు.. అభివృద్ధి మంత్రాన్ని జపించే తారక మంత్రం..

**• అభివృద్ధి సంక్షేమాలే లక్ష్యంగా జిల్లాల పర్యటన**

ఐదు రోజుల టూర్‌ను సాధారణ ప్రభుత్వ కార్యక్రమాల జాబితాగా చూడలేం. ఇది అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, పారిశ్రామికీకరణ, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం అనే ఐదు కీలక అంశాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే కార్యాచరణ. ముఖ్యంగా పర్యటించే జిల్లాల్లోనే రాత్రి పూట బస చేస్తూ ప్రజల మధ్యే ఉండాలని తీసుకున్న సంక్లిష్టమైన నిర్ణయం. ఈ అరుదైన విధానం చంద్రబాబు పని శైలిలోని ప్రత్యేకతను మరోసారి చాటుతోంది. సాధారణంగా ఉదయం అమరావతి నుంచి బయలుదేరి సాయంత్రానికి తిరిగి వచ్చే అధికారిక పర్యటనలకు భిన్నంగా, ఈసారి పూర్తిగా ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. పర్యటన తొలి రోజునే ప్రభుత్వం తన ద్విముఖ విధానాన్ని స్పష్టంగా ప్రజలకు తెలియజేస్తోంది. నెల్లూరు జిల్లా చిల్లకూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటుతుండగా, అదే రోజు శ్రీ సిటీలో రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటోకార్ప్ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడం ద్వారా అభివృద్ధి, పారిశ్రామికీకరణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు సంకేతాలిస్తోంది. సంక్షేమం ఒక వైపు, పెట్టుబడులు మరోవైపు అనే ద్వంద్వ వ్యూహమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తుందనే భావన ఈ కార్యక్రమాల్లో కనిపిస్తోంది.

**• రాయలసీమ ఆర్థిక ప్రగతికి సరికొత్త కార్యాచరణ**

అదేవిధంగా రెండో రోజు కార్యక్రమాలు కూడా అదే దిశగా సాగనున్నాయి. ఉమ్మడి కడప ప్రస్తుత తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ ప్రారంభోత్సవం ఉద్యోగ కల్పన, జీవనోపాధి అవకాశాల పెంపుపై ప్రభుత్వ దృష్టిని ప్రతిబింబిస్తోంది. అలాగే తిరుపతిలో నిర్వహించే జీఎస్‌డీపీ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలను సూచిస్తోంది. నీతి ఆయోగ్ సభ్యులు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ప్రతినిధుల సమక్షంలో జరిగే ఈ సమావేశం రాష్ట్ర అభివృద్ధిని జాతీయ అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేసే ప్రయత్నంగా భావించవచ్చు. ఈ పర్యటనలో అత్యంత కీలక ఘట్టం జూలై మూడున కడపజిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టడం. దశాబ్దాలుగా రాజకీయ చర్చల్లో నలుగుతూ వాయిదాల తెరపై నిలిచిన ఈ ప్రాజెక్టు ఇప్పుడు కార్యరూపం దాల్చే దిశగా అడుగులు వేయడం నిజంగా అదృష్టానికి సంకేతంగా భావించవచ్చు. ఈ ప్రాజెక్టు పనుల శ్రీకారం రాయలసీమ ప్రజల్లో కొత్త ఆశలను రేకెత్తించనున్నాయి. ఒకనాటి కరవును దాటుకొని.. వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా మార్పు చెందుతున్న ఈ ప్రాంతాన్ని ఇపుడు పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు ప్రతీకగా నిలుస్తోంది. ఒక పరిశ్రమ అంటే కేవలం భవనం కాదు. ఉపాధి, అనుబంధ పరిశ్రమలు, స్థానిక ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, యువత భవిష్యత్తు అన్నీ దానితో ముడిపడి ఉంటాయి. అందుకే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. ఫలితంగానే సీమవాసుల్లో ఈసారి చంద్రబాబు నిర్వహిస్తున్న ఈ పర్యటన చరిత్రలో నిలిచిపోయే అవకాశమున్నట్టుగా పరిశీలకులతో పాటు సీమవాదులు ప్రశంసిస్తున్నారు..

**• సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల బస**

ఈ పర్యటనలోనే మరో అద్భుతం సాకారం కానుంది. జూలై మూడు నుంచి అయిదు వరకు చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలోనే పర్యటించనుండటం కూడా రాజకీయ, పరిపాలనా పరంగా ఆసక్తికర అంశంగా మారింది. ఒక ముఖ్యమంత్రిగా కాకుండా సొంతింట ఓ సాధారణ ప్రజాప్రతినిధిగా తన నియోజకవర్గాన్ని పరికించనున్నారు. తనను అక్కున చేర్చుకున్న జన్మభూమిని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని ఆయన గతంలో ఎన్నోసార్లు వ్యక్తం చేశారు. ఇప్పుడు వరుసగా మూడు రోజుల పాటు కుప్పంలోనే బస చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడం ద్వారా ఆ సంకల్పాన్ని కార్యరూపంలో చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానిక మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి



పనుల వేగవంతం వంటి అంశాలపై ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి కనిపిస్తోంది. ఈ ఐదు రోజుల పర్యటనలో మరో విశేషం జిల్లాల్లోనే బస చేయడం. పరిపాలనలో ప్రత్యక్ష పర్యవేక్షణకు చంద్రబాబు ఎప్పటినుంచో ప్రాధాన్యం ఇస్తుంటారు. ఒక ప్రాంతంలో రాత్రి బస చేయడం వల్ల స్థానిక అధికారులతో సమగ్ర సమీక్షలు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రజలతో నేరుగా మాట్లాడే వీలుంటుంది. స్థానిక పరిస్థితులను దగ్గరగా అర్థం చేసుకోవచ్చు. అందుకే ఈ పర్యటనను కేవలం అధికారిక కార్యక్రమాలుగా కాకుండా, క్షేత్రస్థాయి పాలనకు ప్రతీకగా కూడా చూడవచ్చు.


**• రాయలసీమ పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా అడుగులు**

చంద్రబాబు రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే ఆయన పని తీరు ఎప్పుడూ ఒకే విధంగా కనిపిస్తుంది. సమావేశాలు, సమీక్షలు, గడువులు, లక్ష్యాలు, సాంకేతికత వినియోగం, అధికార యంత్రాంగంపై నిరంతర పర్యవేక్షణ... ఇవన్నీ ఆయన పరిపాలనా శైలికి గుర్తింపుగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు, పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాల సృష్టికి ఇచ్చే ప్రాధాన్యం ఆయన ఆర్థిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగాలకన్నా ప్రైవేట్ రంగం ద్వారా భారీ ఉపాధి అవకాశాలు సృష్టించాలనే ఆయన ఆలోచన ఈ పర్యటనలోని కార్యక్రమాల్లో కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పర్యటనలో నెల్లూరు మినహా మిగతా రోజులు రాయలసీమలోనే గడపడం కూడా ప్రత్యేక సందేశాన్ని ఇస్తోంది. అభివృద్ధిలో వెనుకబడిందనే ముద్రను చెరిపేయాలంటే రాయలసీమలో పరిశ్రమలు రావాలి, మౌలిక వసతులు మెరుగుపడాలి, ఉపాధి అవకాశాలు పెరగాలి అనే ప్రభుత్వ ఆలోచన ఈ టూర్‌లో ప్రతిఫలిస్తోంది. రాయలసీమను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందనే సంకేతాలను ఈ పర్యటన ఇస్తోంది. అయితే ఈ పర్యటనలో రాజకీయ కోణం కూడా లేకపోలేదు. ప్రజల మధ్య నిరంతర పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రత్యక్ష భాగస్వామ్యం, స్థానిక నాయకత్వానికి ప్రోత్సాహం, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడం వంటి అంశాలు కూడా ఇందులో అంతర్లీనంగా ఉన్నాయి. అయితే వాటన్నింటికంటే అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజా సంక్షేమం అనే మూడు అంశాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందనే సందేశం ఎక్కువగా వినిపిస్తోంది.

### కడప స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమ కలలు సాకారం

ఇవాల్టి నుంచి అయిదో తేదీ వరకు జరగనున్న ఈ ఐదు రోజుల పర్యటన అనంతరం ప్రారంభమయ్యే ప్రాజెక్టులు ఎంత వేగంగా పూర్తవుతాయి, వాటి ద్వారా ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూరుతుంది అనేదే ఈ పర్యటన విజయాన్ని నిర్ణయిస్తుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఏడో పదులు దాటిన అదే ఉత్సాహం, అదే క్రమశిక్షణ, అదే అభివృద్ధి దృక్పథంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించాలంటే సంక్షేమంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం కూడా అంతే ముఖ్యమని ఈ ఐదు రోజుల పర్యటన మరోసారి చాటబోతోంది. చివరగా చెప్పుకోవాల్సిన మరో ముఖ్యమైన మాట ఏంటంటే.. ఇద్దరు ముఖ్యమంత్రులైన తండ్రీ కొడుకులకు జన్మనిచ్చిన కడపజిల్లాలో స్టీల్ ఫ్యాక్టరీకి చంద్రబాబు ప్రాణం పోయనున్నారు.. ఎన్నో పోరాటాలు . మరెంతో కాలం నాటి ఆకాంక్ష తీరిపోయే అవకాశం కళ్లెదురుగా వచ్చి నిలిచింది. ఆ కలల ప్రపంచాన్ని ఒక్క కడప వాసులే కాదు.. రాయలసీమ నేల లోని అణువణువూ ఎదురుచూసిన సమయమంతా ఆసన్నమై ప్రశాంతంగా ప్రసన్నమయ్యే క్షణాలు దగ్గరయ్యాయి.. ఆ ఫలాలు అందుకోడానికి సీమ జనం ఉద్యుక్తులవుతున్నారు.

**- హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**



# కోట్ల రూపాయల బస్టాండ్..

# చీకటి అడ్డా..!?

- ప్రారంభానికి నోచుకోని రవాణా ప్రాంగణం
- ప్రజాధనం వృథాతో ఎవరికి ప్రయోజనం?
- కలవరపెడుతోన్న నిర్లక్ష్యపు వ్యవహారం!
- అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా బస్టాండ్



కడపజిల్లా ప్రొద్దుటూరు... రాయలసీమలో బంగారు నగరంగా పేరొందిన పట్టణం. బంగారు వ్యాపారానికి చిరునామా. వాణిజ్యానికి కేంద్రం. దసరా ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు. "రెండో ముంబై", "రెండో మైసూరు", "దక్షిణ కాశీ", "సిరిపురం" వంటి పేర్లతో గుర్తింపు పొందిన ఈ పట్టణం అభివృద్ధిలో ఎప్పుడూ ముందంజలో ఉండాలని ప్రజలు కోరుకుంటారు. అలాంటి ప్రొద్దుటూరుకు ఆధునిక సౌకర్యాలతో కొత్త బస్టాండ్ నిర్మిస్తే అది పట్టణానికి మరో ఆకర్షణగా మారాల్సింది. కానీ ప్రస్తుతం అదే బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దాదాపు మూడు సంవత్సరాల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. సుమారు నాలుగున్నర కోట్ల రూపాయల వ్యయంతో, ప్రస్తుతం ఉన్న బస్టాండ్ ఆవరణలోనే 12 ప్లాట్‌ఫారమ్‌లతో ఆధునిక బస్టాండ్ నిర్మించారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్ వంటి కొన్ని తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.
నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

**ఖాళీ భవనం చీకటి కార్యకలాపాలకు కేంద్రమా?**

కొత్త భవనం ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో అది అసాంఘిక శక్తులకు ఆశ్రయంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడం, భద్రతా సిబ్బంది లేకపోవడం, విద్యుత్ వెలుతురు లేకపోవడం వంటి కారణాలతో రాత్రివేళల్లో అక్కడికి అనుమానాస్పద వ్యక్తులు చేరుతున్నారని చెబుతున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా బస్టాండ్ ఆవరణలో అక్కడక్కడా పడేసిన మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు, ఉపయోగించిన కండోమ్ కవర్లు కనిపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవి కేవలం చెత్త మాత్రమే కాదని, అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరుగుతున్నాయనే అనుమానాలకు కారణమవుతున్నాయని అంటున్నారు. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, కొత్తగా నిర్మించిన కొన్ని గదులు మరుగుదొడ్లుగా మారిపోయాయని స్థానికులు చెబుతున్నారు. సరైన నిర్వహణ లేకపోవడంతో భవనం లోపల, బయట అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయని, దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తి ప్రారంభం కాకముందే నిర్లక్ష్యానికి గురవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఇది సాధారణ ప్రదేశం కూడా కాదు. బస్టాండ్ పక్కనే ఆర్టీసీ డిపో, డిపో మేనేజర్ కార్యాలయం, ఇతర సిబ్బంది కార్యాలయాలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ పరిస్థితిపై తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**• అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ఆశలు ఆవిరి?**

రోజూ అధికారులు ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్నా ఈ దుస్థితి ఎందుకు కనిపించడం లేదని వారు నిలదీస్తున్నారు. ప్రభుత్వం ప్రజల పన్నుల రూపంలో వచ్చే నిధులతో ఇలాంటి మౌలిక సదుపాయాలను నిర్మిస్తుంది. వాటి లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడం. కానీ నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా వాటిని వినియోగంలోకి తీసుకురాకపోతే ప్రజాధనం ప్రయోజనం లేకుండా పోతుంది. అంతేకాకుండా నిర్వహణ లేక భవనం దెబ్బతింటే మరమ్మతుల పేరుతో మరోసారి ప్రభుత్వ ఖజానాపై భారం పడే అవకాశం ఉంది. కొత్త బస్టాండ్ ప్రారంభమైతే ప్రయాణికులకు విశాలమైన ప్లాట్ ఫారమ్‌లు, మెరుగైన రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రమైన వాతావరణం లభిస్తాయి. స్థానిక వ్యాపారులకు కూడా ఉపయోగం ఉంటుంది. పట్టణ ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది. కానీ ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రజలు ఇప్పటికీ పాత బస్టాండ్‌కే పరిమితమవుతున్నారు. ప్రొద్దుటూరు వంటి అభివృద్ధి చెందిన పట్టణంలో ప్రధాన రవాణా కేంద్రం ఈ స్థితిలో ఉండటం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ఒకవైపు పట్టణం అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు కోట్ల రూపాయలతో నిర్మించిన బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు వేదిక కావడం పరిపాలనా వైఫల్యంగా వారు అభివర్ణిస్తున్నారు.



### ప్రొద్దుటూరు ప్రతిష్ఠ కాపాడండంటున్న లోకల్స్!

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి, ఉమ్మడి కడప జిల్లాకు చెందిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులు, ఇతర సాంకేతిక అంశాలను వెంటనే పూర్తి చేసి బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతవరకు భద్రతా సిబ్బందిని నియమించి, రాత్రి పూట పోలీసు గస్తీ పెంచి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ప్రొద్దుటూరు అంటే కేవలం బంగారు వ్యాపారం మాత్రమే కాదు, అభివృద్ధికి ప్రతీక కూడా. అలాంటి పట్టణానికి వచ్చే ప్రతి ప్రయాణికుడు ముందుగా చూసేది బస్టాండ్. అదే పట్టణానికి ముఖద్వారం. అందుకే ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ బస్టాండ్ జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవాలి గానీ, మరుగుదొడ్డి, మందుబాబుల అడ్డా, వ్యభిచార కేంద్రంగా విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి రాకూడదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త బస్టాండ్‌ను తక్షణమే ప్రారంభించి, పరిశుభ్రత, భద్రత, నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటేనే కోట్ల రూపాయల ప్రజాధనం సార్థకమవుతుంది. లేకపోతే ప్రజల సౌకర్యం కోసం నిర్మించిన ఈ ఆధునిక నిర్మాణం నిర్లక్ష్యానికి, అసాంఘిక కార్యకలాపాలకు ప్రతీకగా మిగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- మహేష్ పోసా, నా దేశం ప్రతినిధి, ప్రొద్దుటూరు.. కడప జిల్లా**



# ఈ దేశంలో నేనెవరిని ?

- నేను భారతీయుడ్ని ఎట్లవుతా?
- సగటు పౌరుడి అభద్రతా భావం
- భారతీయుడు అస్తిత్వ పోరాటం
- ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ చెల్లని పౌరసత్వం

**భారతదేశంలో నివసిస్తున్న ప్రతి పౌరుడిని ఇప్పుడు ఒకే ఒక ప్రశ్న తీవ్రంగా వేధిస్తోంది. మనం ఈ దేశ పౌరులమే అనడానికి నిఖార్సైన సాక్ష్యం ఏది? నిన్నటి వరకు ప్రాణప్రదంగా భావించిన ఆధార్ కార్డు కేవలం నివాస గుర్తింపు మాత్రమేనని పాలకులు తేల్చేశారు. ప్రపంచవ్యాప్తంగా మన దేశ గౌరవాన్ని చాటే పాస్‌పోర్ట్ సైతం కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ఓటరు ఐడీ, పాన్ కార్డులు కూడా పౌరసత్వాన్ని చట్టబద్ధంగా నిరూపించలేవనే నిజం సామాన్యులను గందరగోళంలోకి నెడుతోంది. అధికారిక విచారణల అనంతరం జారీ అయ్యే పత్రాలకే విలువ లేకపోతే, భవిష్యత్తులో సగటు పౌరుడి పరిస్థితి ఏమవుతుందనే ఆందోళన మొదలైంది. న్యాయపరమైన చిక్కులు ఎదురైనప్పుడు కోర్టులు కూడా వీటిని తుది ఆధారాలుగా అంగీకరించడం లేదు. ఇతర దేశాల్లో లాగా ఒకే ఒక 'యూనివర్సల్ సిటిజన్‌షిప్ సర్టిఫికెట్' లేకపోవడం మన దేశంలో పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, ప్రతి భారతీయుడికి తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఒక కచ్చితమైన పౌరసత్వ పత్రాన్ని అందించాల్సిన బాధ్యత ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.**

దేశంలో నివసిస్తున్న సామాన్య పౌరుడికి ఇప్పుడు ఒక పెద్ద ప్రశ్న ఎదురవుతోంది. మనం భారతీయులం అనడానికి అసలైన రుజువు ఏది? నిన్నటి వరకు మనం ఎంతో నమ్మకంగా దాచుకున్న ఆధార్ కార్డు కేవలం ఒక గుర్తింపు కార్డు మాత్రమేనని ప్రభుత్వం తేల్చేసింది. విదేశాలకు వెళ్లేందుకు ఉపయోగించే పాస్‌పోర్ట్ కేవలం ఒక ప్రయాణ పత్రం... ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ఓటరు ఐడీ, పాన్ కార్డులు కూడా పౌరసత్వానికి చట్టబద్ధమైన నిదర్శనాలు కావు. ఈ నిర్ణయాలు సాధారణ ప్రజలను తీవ్ర గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. అన్ని ఆధారాలు ఉన్నా.. నేను భారతీయుడిని అని నిరూపించుకోవడానికి ఇంకేం కావాలి అనే ఆందోళన ప్రతి ఒక్కరిలో మొదలైంది.

**ఇతర దేశాల విధానం, భారతీయ సంక్లిష్టత**

ప్రపంచంలోని అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో పౌరులందరికీ ఒకే రకమైన 'యూనివర్సల్ సిటిజన్‌షిప్ సర్టిఫికెట్' ఉంటుంది. అది వారి పౌరసత్వాన్ని స్పష్టంగా ధృవీకరిస్తుంది. మన దేశంలో అటువంటి ఏకైక పౌరసత్వ పత్రం అంటూ ఏదీ లేదు. ఇక్కడ మెజారిటీ ప్రజలకు పుట్టుక ఆధారంగానే పౌరసత్వం వస్తుంది. పాత తరం సామాన్యుల దగ్గర కేవలం స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులు, పాత ఓటరు జాబితాలు మాత్రమే ఉన్నాయి. గతంలో అస్సాంలో అమలు చేసిన ఎన్నార్సీ ప్రక్రియలో సరైన పత్రాలు సమర్పించలేక దాదాపు 19 లక్షల మంది తమ గుర్తింపును కోల్పోయారు. ఈ భయానక వాస్తవం సగటు భారతీయుడిని భయపెడుతోంది.

**చట్టాలు చెప్పే నిజాలు, కోర్టుల తీర్పులు**

మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుండి 11 వరకు, అలాగే 1955 పౌరసత్వ చట్టం పౌరుడెవరో నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం మనం వాడుతున్న ఏ ఒక్క కార్డు కూడా పౌరసత్వానికి పూర్తి ఆధారంగా నిలవదు. కోర్టులు సైతం పౌరసత్వ వివాదాలు వచ్చినప్పుడు పాస్‌పోర్ట్ లేదా ఆధార్‌ను తుది సాక్ష్యంగా అంగీకరించడం లేదు. ఒక వ్యక్తి తన పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత పూర్తిగా ఆ వ్యక్తిపైనే ఉంటుందని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితులలో విదేశీయులకు కూడా పాస్‌పోర్ట్ తరహా ప్రయాణ పత్రాలు జారీ చేసే అవకాశం ఉంది. కాబట్టి పాస్‌పోర్ట్ ఉన్నంత మాత్రాన పక్కా భారతీయుడు అనుకోవడం కుదరదు.

**పౌరుల అభద్రతను తొలగించే మార్గం**

ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో సామాన్య ప్రజల్లో నెలకొన్న భయాలను పోగొట్టాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఆధార్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడీ వంటి పత్రాలు పౌరసత్వానికి తుది ఆధారాలు కావనే నిజాన్ని స్పష్టం చేసిన నేపథ్యంలో, ఒక కొత్త చట్టబద్ధమైన వ్యవస్థను తీసుకురావాలి. దేశంలోని ప్రతి పౌరుడికి సులభంగా లభించేలా ఒకే ఒక 'యూనివర్సల్ సిటిజన్‌షిప్ కార్డ్' లేదా నిర్దిష్ట పౌరసత్వ ధృవీకరణ పత్రాన్ని ప్రభుత్వం రూపొందించాలి. దీనివల్ల సామాన్యులు తమ భారతీయతను నిరూపించుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పుతుంది. గతంలో అస్సాం ఎన్నార్సీ వంటి ప్రయోగాల వల్ల లక్షలాది మంది నిరుపేదలు పత్రాలు లేక ఇబ్బందులు పడ్డారు. అటువంటి తప్పులు మళ్లీ జరగకుండా, పుట్టుక ఆధారంగా పౌరసత్వాన్ని గుర్తించే ప్రక్రియను మరింత సరళతరం చేయాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాత రికార్డులను, డిజిటల్ డేటాను అనుసంధానించాలి. సామాన్య పౌరుడిని అభాగ్యుడిగా మార్చకుండా, ప్రతి ఒక్కరికీ పటిష్టమైన అస్తిత్వ భరోసా కల్పించడం కేంద్రం తక్షణ కర్తవ్యం.

# రక్తసిక్తమైన ప్రేమకథ

- ఊపిరి ఆపేసే క్రైమ్ థ్రిల్లర్
- లోహగఢ్ మిస్టరీలో ఊహకందని మలుపులు

**ఒకవైపు భానుడి భగభగలు.. మరోవైపు లోహగఢ్ కోటపై చావు నీడలా వెంటాడుతున్న హూడీ ధరించిన కిల్లర్. కాబోయే భర్తను లోయలోకి నెట్టేసిన క్రూరమైన ప్రేమికులు, వారి అబద్ధాలను ఛేదించడానికి పోలీసులు సిద్ధం చేసిన 'గేట్ అనాలసిస్' నడక పరీక్ష ఈ కథలో ఒక మైండ్ బ్లోయింగ్ సీన్ అయితే, ఇప్పుడు వెలుగులోకి వచ్చిన మరో ట్విస్ట్ థ్రిల్ ను పీక్స్‌కు తీసుకెళ్లింది. ఈ దారుణ హత్య వెనుక కేవలం ఇద్దరే లేరు, ఒక లవ్ స్టోరీ ముసుగులో సాగిన సుదీర్ఘమైన స్కెచ్ ఉందనే అనుమానాలు రేగుతున్నాయి. సొంత అక్క లవ్ ట్రాక్, కాబోయే బావమరిది మౌనం వెనుక దాగున్న రహస్యాలు విస్తుపోయేలా చేస్తున్నాయి. నిశ్శబ్దంగా సాగిన ఈ పెను కుట్రలో డ్రైవర్ ఇచ్చిన సాక్ష్యం, చినిగిన పాస్‌పోర్ట్ కథలు వెండితెరపై వచ్చే సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. ఊపిరి బిగబట్టే ఈ మలుపుల మధ్య అసలు సూత్రధారులు ఎందరు, ఈ రక్తపాతంలో ఎవరెవరి పాత్రలు ఉన్నాయనే నిజాలు త్వరలోనే మైండ్ బ్లాంక్ చేయనున్నాయి.**



## తోడబుట్టినవాడి పాత్ర ?

- లోహగఢ్ హత్య కేసు కొత్త మలుపు
- కొంప ముంచిన తమ్ముడి మౌనం



పుణె లోహగఢ్ కోట పైన కేతన్ అగర్వాల్ జరిగిన దారుణ హత్య కేసులో ప్రతిరోజూ కొత్త నిజాలు బయటకు వస్తున్నాయి. ఈ ఘోర కలికాలంలో ప్రియుడు చేతన్ తో కలిసి సొంత కాబోయే భర్తను చంపిన సియా గోయల్ ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఇప్పుడు ఈ కేసు దర్యాప్తులో సియా సొంత తమ్ముడు సాహిల్ గోయల్ పాత్రపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం రోజున పోలీసులు సాహిల్ ను దాదాపు 10 గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. సియా, చేతన్ ల మధ్య ఉన్న అక్రమ సంబంధం గురించి సాహిల్ కు ముందే తెలుసని, ఆ విషయాన్ని అతడు కావాలనే కుటుంబ సభ్యులకు చెప్పకుండా దాచాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

**తమ్ముడు చెప్పిన అబద్ధాలు**

పోలీసుల విచారణ అనంతరం సాహిల్ ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ తన అక్క అమాయకురాలని చెప్పే ప్రయత్నం చేశాడు. సియా, చేతన్ లు కేవలం స్నేహితులు మాత్రమేనని తాను నమ్మానని సాహిల్ చెప్పుకొచ్చాడు. కేతన్ ను పెళ్లి చేసుకోవడమే సియాకు ఇష్టమని, చేతన్ తో ఎలాంటి సంబంధం లేదని తనతో చెప్పిందని అతడు అన్నాడు. కేతన్ తో పెళ్లి చేసుకోవడానికి సియా ఎంతో సంతోషంగా ఎదురుచూసిందని, ప్రీవెడ్డింగ్ ఫోటోషూట్ కోసం ఎన్నో ప్రణాళికలు వేసుకుందని సాహిల్ వివరించాడు. అయితే పోలీసుల విచారణలో మాత్రం సియాకు కేతన్ తో పెళ్లి ఇష్టం లేదనే విషయం సాహిల్ కు ముందే తెలుసని తేలింది.

**డ్రైవర్ సాక్ష్యంతో...**

సాహిల్ చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో జరిగిన సంఘటనలకు అస్సలు పొంతన లేదు. గతంలో ఒకసారి ప్రీవెడ్డింగ్ షూట్ కోసం విమానాశ్రయానికి వెళ్ళడానికి సియా నిరాకరించినప్పుడు, సాహిల్ ఆమెను బలవంతంగా కారు ఎక్కించాడని వారి డ్రైవర్ పోలీసులకు సాక్ష్యం ఇచ్చాడు. అంతేకాకుండా, బాలి పర్యటనకు వెళ్ళవలసి ఉన్న సమయంలో కేతన్ పాస్‌పోర్ట్ చిరిగిపోయినప్పుడు కూడా సాహిల్ మౌనంగా ఉన్నాడు. ఈ సంఘటనలన్నీ చూస్తుంటే సాహిల్ కు ఈ కుట్రతో సంబంధం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి.

**పెను కుట్రగా మారిన హత్య కేసు**

మొదట కేవలం ఇద్దరి మధ్య జరిగిన హత్యగా భావించిన ఈ కేసు, ఇప్పుడు ఒక పెద్ద ముందస్తు ప్రణాళిక బద్ధమైన కుట్రగా మారుతోంది. సాహిల్ ఇచ్చిన సాక్ష్యం ఈ కేసులో చాలా కీలకం కానుంది. అతడు కావాలనే నిజాలు దాచాడా లేదా హంతకులకు సహాయం చేశాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం సాహిల్ ను నిందితుడిగా చేర్చకపోయినప్పటికీ, అతడిపై గట్టి నిఘా ఉంచారు. జూన్ 18న జరిగిన ఈ దారుణ హత్యకు సంబంధించిన పూర్తి ఆధారాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

## కట్టుకథలు చెబుతున్నారు

- పూణె హత్య కేసులో లేటెస్ట్ ట్విస్ట్
- హూడీలో ఉంది చేతన్ కాదన్న లాయర్
- లోహగఢ్ కోట మలుపులు

పుణె సమీపంలోని లోహగఢ్ కోట పైన జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు ఇప్పుడు సంచలనంగా మారింది. జూన్ 18వ తేదీన కేతన్ ను అతని కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి కలిసి కోట పైనుంచి లోయలోకి నెట్టేశారు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా చిత్రీకరించాలని వారు ప్రయత్నించారు. పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేయగా అసలు నిజాలు బయటపడ్డాయి. జూన్ ఎండల్లో 33 డిగ్రీల వేడి ఉన్నప్పటికీ చేతన్ కోటపై హూడీ ధరించి, హెడ్‌సెట్ పెట్టుకుని తిరగడం సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది. అతడు సియా, కేతన్ లను కొద్ది దూరంలో వెంబడిస్తూ వెళ్లినట్లు ఆధారాలు లభించాయి.

**కోర్టులో లాయర్ వింత వాదన**

పుణె లోని వడ్గావ్ కోర్టులో ఈ కేసు విచారణకు వచ్చినప్పుడు నిందితుడు చేతన్ తరఫు న్యాయవాది ఒక వింత వాదనను తెరపైకి తెచ్చారు. సీసీటీవీ ఫుటేజీలో హూడీ వేసుకుని ఉన్న వ్యక్తి తన క్లయింట్ చేతన్ కాదని ఆయన వాదించారు. ఆ వీడియోలో ఉన్నది వేరే వ్యక్తి అని కోర్టును నమ్మించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు ఈ కేసులో నిందితుడిని ఖచ్చితంగా నిరూపించాల్సిన సవాలు ఎదురైంది. చేతన్ పాత ఫోటోలను, సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన పోలీసులు ఆ వీడియోలో ఉన్నది అతడేనని బలంగా నమ్ముతున్నారు.

**నడక శైలితో నేర నిరూపణ**

లాయర్ వాదనను తిప్పికొట్టడానికి పుణె రూరల్ పోలీసులు ఇప్పుడు ఒక సరికొత్త శాస్త్రీయ పద్ధతిని ఎంచుకున్నారు. అదే 'గేట్ అనాలసిస్'...నడక శైలి విశ్లేషణ. ప్రతి మనిషికి వేలిముద్రలు ఎంత ప్రత్యేకంగా ఉంటాయో, వారి నడిచే విధానం కూడా అంతే ప్రత్యేకంగా ఉంటుంది. చేతన్ ను ఆరోజు వేసుకున్న దుస్తులలోనే లోహగఢ్ కోటకు తీసుకువెళ్లి నడిపించనున్నారు. ఫోరెన్సిక్ బృందం అతని నడక వేగం, అడుగుల మధ్య దూరం, శరీర నిర్మాణాన్ని సీసీటీవీ వీడియోతో శాస్త్రీయంగా పోల్చి చూసి నివేదిక ఇవ్వనుంది.

**ముందే జరిగిన హత్యాయత్నం**

ఈ దారుణమైన హత్య వెనుక పెద్ద కుట్రే ఉందని పోలీసులు గుర్తించారు. సియా, చేతన్ కలిసి చాలా కాలంగా కేతన్ ను వదిలించుకోవాలని ప్లాన్ చేశారు. హత్య జరగడానికి నాలుగు రోజుల ముందే, అదే కోటపై కేతన్ ను నెట్టేసి చంపాలని సియా ప్రయత్నించింది. ఆ సమయంలో వీలు కాకపోవడంతో జూన్ 18న పక్కా పథకంతో కేతన్ ను ముగ్గులోకి దించి అంతమొందించారు. ఈ శాస్త్రీయ పరీక్షతో నిందితులిద్దరికీ శిక్ష పడటం ఖాయమని పోలీసులు భావిస్తున్నారు.

# బండి సంజయ్ పై కేసు కొట్టివేత

- కేంద్ర మంత్రికి నాంపల్లి కోర్టు క్లీన్ చిట్!



హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పెద్ద ఊరట లభించింది. ఈ వివాదాస్పద కేసును సుదీర్ఘంగా విచారించిన నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు ఆయనపై ఉన్న ఆరోపణలను కొట్టివేస్తూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో కేంద్ర మంత్రికి చట్టపరమైన చిక్కుల నుండి పెద్ద ఉపశమనం లభించినట్లయింది. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు రూ.25 వేల వరకు పంచుతోందని విమర్శించారు. ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన డబ్బును బీఆర్ఎస్ నాయకులే నొక్కుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ రాజకీయ వ్యాఖ్యల ఆధారంగానే హుజూరాబాద్ పోలీసులు ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నిలబడదని కోర్టు తేల్చేసింది.

## నేడే మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు



**బద్వేలు:** డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు నేడు బద్వేలు నియోజకవర్గంలో ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆయన రోజంతా పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 7 గంటలకు నెల్లూరు రోడ్డులోని వెంకటేశ్వర స్వామి పూజతో చైర్మన్ పర్యటన ప్రారంభమవుతుంది. అనంతరం అగ్రహారంలో పెన్షన్ల పంపిణీ, అన్న క్యాంటీన్ వద్ద పుట్టినరోజు వేడుకల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు జహంగీర్ యువసేన ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో వేడుకలు ముగించుకుని, సిమాంక్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. 11 గంటల నుండి ఎన్జీఓ కాలనీలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 'ఆనంద నిలయం' వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, వస్త్ర వితరణ చేయనున్నారు. చివరగా సాయంత్రం 6 గంటలకు ఎన్జీఓ కాలనీలో అరవ శ్రీనివాసులురెడ్డి, పల్లె రమేష్ రెడ్డి, ఉప్పతి గంగాధర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో పాల్గొంటారు. ఈ సేవా కార్యక్రమాల్లో అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## ఆశారాం బాపుకు దక్కని ఊరట

**బెయిల్ మంజూరుకు సుప్రీం నిరాకరణ**

మైనర్ బాలికపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న స్వయంప్రకటిత ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపునకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. రాజస్థాన్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం, ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఆశారాం తరఫు న్యాయవాదులు వైద్య కారణాలను చూపిస్తూ బెయిల్ కోరినప్పటికీ, ప్రాణాంతక అత్యవసర పరిస్థితి ఉంటేనే దాన్ని పరిశీలిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై రెండు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం ఇచ్చే నివేదికను పరిశీలించిన తర్వాతే బెయిల్‌పై తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించింది. ప్రస్తుతం ఆశారాం జోధ్‌పూర్ జైలులో ఉన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ పేలుడు

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ బాపూనగర్‌లో గల ఒక రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో సంభవించిన భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రిటైర్డ్ ఉద్యోగి దేవేందర్ తన కుటుంబంతో కలిసి గత 24 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నారు. మంగళవారం ఆయన ఇంట్లోని వంటగదిలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ప్రమాద ధాటికి ఇంటి గోడలు, కిటికీలు, తలుపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే, ఘటన సమయంలో ఇంట్లోనే ఉన్న కుటుంబ సభ్యులంతా ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ వంటివి సురక్షితంగానే ఉండటం, అలాగే ఎలాంటి అగ్నిప్రమాద ఆనవాళ్లు లేకపోవడంతో ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రేపు ఏపీ ఈఏపీసెట్2026 ఫలితాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ 2026 ఫలితాల విడుదల మరోమారు వాయిదా పడింది. జూన్ 30న విడుదల కావాల్సిన ఈ ఫలితాలను జూలై 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రకటించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈఏపీసెట్ ర్యాంకుల కేటాయింపులో ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉంటుంది. అయితే, సీబీఎస్ఈ 12వ తరగతి రీఇవాల్యుయేషన్, ఫలితాలు పూర్తిస్థాయిలో రాకపోవడం, అలాగే ఏపీ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మార్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులెవరూ నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ఫలితాలను వాయిదా వేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి స్పష్టం చేసింది. మే 12 నుండి 20 వరకు జరిగిన ఈ పరీక్షలకు దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

## కొత్త ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు

భారత సైన్యానికి 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ధీరజ్ సేథ్ ఆర్మీ కమాండ్‌ను చేపట్టారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుండి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ఆయన రికార్డు సృష్టించారు. 1986లో సైన్యంలో చేరిన జనరల్ ధీరజ్ సేథ్‌కు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళ కమాండర్‌గా, అలాగే సదరన్, సౌత్ వెస్ట్రన్ కమాండ్లకు ఆర్మీ కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. రక్షణ రంగ ప్లానింగ్, సైన్యం ఆధునికీకరణపై ఆయన ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

## రైతుల సమస్యలు మాకు తెలుసు

- కట్టుకథలు నమ్మకండి: డిప్యూటీ సీఎం భట్టి

ప్రభుత్వానికి రైతుల కష్టాలు, పంట కొనుగోలు సమస్యలు పూర్తిగా తెలుసని, అందుకే అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శిల్పకళావేదికలో జరిగిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతలు కేటీఆర్, హరీష్‌రావుల తీరుపై భట్టి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పుల వల్లే ప్రస్తుతం తాము రూ.2 లక్షల 8 వేల కోట్లు కేవలం అసలు, వడ్డీలు కట్టడానికే ఖర్చు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఆ అప్పులు లేకుంటే ఆ నిధులను నేరుగా రైతులకే ఇచ్చేవాళ్లమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలోనే రూ.1 లక్షా 56 వేల కోట్లు ఖర్చు చేశామని, అబద్ధపు ప్రచారాలు నమ్మకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన బీఆర్ఎస్ : మంత్రి తుమ్మల

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన రైతు భరోసా సభలో ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాము ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేసి, తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లకు పైగా జమ చేశామని వెల్లడించారు. "కేసీఆర్ ఒక్క రైతుబంధు ఇచ్చి.. మిగిలినవన్నీ బంద్ చేశారు" అంటూ తుమ్మల మండిపడ్డారు. గత ప్రభుత్వం కేంద్ర నిధులతో నడిచే పలు వ్యవసాయ పథకాలను కూడా నిలిపివేసిందని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో ఆయిల్‌పామ్ సాగులో కూడా రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు.

## కొడాలి నానికి హైకోర్టులో ఊరట

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయనపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతిపై హైకోర్టు స్టే విధించింది. అలాగే తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు, ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌లపై కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2021 ఫిబ్రవరిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ప్రభుత్వం ప్రాసిక్యూషన్‌కు అనుమతించడాన్ని సవాలు చేస్తూ కొడాలి నాని హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఈ మేరకు స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభాత కిరణమ్ — సత్యానికి వారధి
Entertainment
Cinema & Sports News
బుధవారం 01 జులై 2026
www.prabhathakiranam.com



# ముంబై వీడిన హార్దిక్ పాండ్యా

## బెంగళూరుకు మారిన మకాం

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన నివాసాన్ని ముంబై నుండి బెంగళూరుకు శాశ్వతంగా మార్చారు. బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ను తన మిగిలిన కెరీర్ కోసం శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. సాధారణంగా భారత క్రికెటర్లు కేవలం గాయాల నుంచి కోలుకోవడానికి, ఫిట్‌నెస్ పరీక్షల కోసమే ఈ కేంద్రానికి వస్తుంటారు. అయితే, ఒక యాక్టివ్ క్రికెటర్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం భారత క్రికెట్ చరిత్రలో ఇదే మొదటిసారి. ముంబైలోని తన నివాసం నుండి శిక్షణా మైదానాలకు వెళ్లడానికి ప్రయాణ ఇబ్బందులు ఎదురుకావడంతో పాండ్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయంతో బాధపడుతున్న ఆయన, యూకే పర్యటనకు దూరమై కోలుకుంటున్నారు. బెంగళూరు శివార్లలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్న పాండ్యా, జాతీయ జట్టుకు లేదా ఐపీఎల్‌కు ఆడని సమయంలో ఇక్కడే ప్రాక్టీస్ చేయనున్నారు. ఇందుకోసం సొంత ఖర్చులతో ప్రత్యేక ఫిజియోథెరపిస్ట్, స్ట్రెంత్ కోచ్‌ను కూడా నియమించుకున్నారు. రాబోయే ఐదు నుండి ఆరు ఏళ్ల పాటు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగడమే లక్ష్యంగా ఆయన ఈ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.



# మహిళల టీ20 ప్రపంచకప్

## ఎనిమిదోసారి ఫైనల్స్‌కు ఆస్ట్రేలియా

లండన్‌లోని ది ఓవల్ మైదానంలో జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్ మొదటి సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి, ఎనిమిదోసారి టోర్నమెంట్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. వెస్టిండీస్ నిర్దేశించిన 126 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 13 ఓవర్లలోనే (42 బంతులు మిగిలి ఉండగానే) ఛేదించి రికార్డు సృష్టించింది. 100 పరుగులకు పైబడిన లక్ష్య ఛేదనలో అత్యధిక బంతులు మిగిలి ఉండగా విజయం సాధించడం మహిళల టీ20 ప్రపంచకప్ నాకౌట్ చరిత్రలోనే ఇదే మొదటిసారి.

# జింబాబ్వే చారిత్రాత్మక విజయం

## బంగ్లాదేశ్‌పై భారీ తేడాతో గెలుపు

హరారే వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో జింబాబ్వే ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించింది. పర్యాటక బంగ్లాదేశ్ జట్టును రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 185 పరుగులకే ఆలౌట్ చేయడం ద్వారా జింబాబ్వే ఇన్నింగ్స్, 85 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. టెస్టు క్రికెట్ చరిత్రలో జింబాబ్వేకు ఇదే అతిపెద్ద విజయం కావడం గమనార్హం. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజారబానీ నాలుగు వికెట్లతో చెలరేగగా, కెప్టెన్ రిచర్డ్ న్గరవా మూడు వికెట్లు తీసి బంగ్లాదేశ్ పతనాన్ని శాసించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే.. ఇన్నోసెంట్ కాయా అద్భుత శతకంతో (410) భారీ స్కోరు సాధించి ఆధిక్యంలోకి వెళ్లింది. బంగ్లాదేశ్ బ్యాటర్లలో ముష్ఫికర్ రహీమ్ (34), కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (30) మాత్రమే కాసేపు పోరాడారు. పిచ్ పరిస్థితులకు అలవాటు పడకపోవడం, బ్యాటింగ్ వైఫల్యమే తమ ఓటమికి కారణమని బంగ్లా కెప్టెన్ అంగీకరించారు. సెంచరీతో రాణించిన కాయాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.






# అంతా రహస్యం

## »వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం
## »దాటవేసిన శ్రేయస్ అయ్యర్

ఇంగ్లాండ్‌తో బుధవారం నుండి ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్పష్టత ఇవ్వలేదు. ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ కోల్పోయిన నేపథ్యంలో, బ్యాటింగ్ లైనప్‌లో మార్పులు ఉంటాయా, ముఖ్యంగా సూర్యవంశీ జట్టులోకి వస్తారా అన్న ప్రశ్నలు తలెత్తాయి. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఈ చర్చ ఊపందుకుంది. ఈ విషయమై శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. జట్టులోని ప్రణాళికలు, కాంబినేషన్లు చాలా రహస్యమైనవని, వాటిని ప్రత్యర్థి జట్టుకు తెలిసేలా ముందే బయటపెట్టలేమని స్పష్టం చేశారు. "సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభావంతుడు, అతనికి అవకాశం వచ్చినప్పుడు ఖచ్చితంగా రాణిస్తాడు. అయితే ప్రస్తుతం మా చేతులు కూడా కట్టేసి ఉన్నాయి" అని అయ్యర్ వ్యాఖ్యానించారు. గతంలో టీ20 ప్రపంచకప్ గెలిచిన సీనియర్ ఆటగాళ్లకు అండగా నిలవడం, జట్టులో అందరికీ ఆత్మవిశ్వాసం కల్పించడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను తాను ఫాలో అవ్వనని అయ్యర్ తేల్చిచెప్పారు.




# అల్లరి నరేశ్.. మళ్లీ కామెడీ ట్రాక్

## కొత్త మూవీ రంభ ఊర్వశి మేనక ఫస్ట్ లుక్ విడుదల

కామెడీ కింగ్ అల్లరి నరేష్ మంగళవారం తన పుట్టినరోజును జరుపుకున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# నాగబంధంలో.. అద్భుతమైన పాత్ర నాది

## నటి నభా నటేశ్ ఆసక్తికర విషయాలు వెల్లడి



నేను నటించిన ఓ అరుదైన సినిమా 'నాగబంధం'. ఇందులో పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో నేను కనిపిస్తా. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా పోరాడే ఆ పాత్ర కథకు కీలకం. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేసే ఆ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. ఇలాంటి పాత్రలు మళ్లీ మళ్లీ చేయాలనుకున్నా వచ్చేవి కాదు. దర్శకుడు అభిషేక్ నామా ఈ కథ చెప్పిన తీరు, ఆయన విజన్ వినగానే నేను ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నా. ఈ సినిమాని థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకుల్లాగే నేనూ ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని నటి నభా నటేశ్ అన్నారు. ప్రేక్షకులు చూసి ఆశ్చర్యపోయేలా, నటిగా నేనెంతో గర్వపడేలా చేసే పాత్రనే 'నాగబంధం'లో చేశానని కథానాయిక నభానటేశ్ తెలిపారు. 'ఇస్మార్ట్ శంకర' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె అవకాశాల్ని సొంతం చేసుకుంటూ తెరపై మెరుస్తోంది. ఇటీవల 'నాగబంధం'లో ఓ కథానాయికగా నటించింది. విరాట్ కర్ణ కథానాయకుడిగా... అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. తాను పోషించిన పార్వతి పాత్ర కోసం సిద్ధం కావడానికి రోజూ రెండు గంటలు సమయం పట్టేది. ప్రతి కాస్ట్యూమ్ విషయంలో ఎంతో జాగ్రత్త తీసుకోవల్సి వచ్చేది. నమోరే... పాటతోపాటు మరో జానపద గీతం కూడా చేశా. ఈ రెండు పాటలు విజువల్‌గా చాలా ఘనంగా ఉంటాయి. ఐదువేల మంది డ్యాన్సర్లతో నమోరే.. పాటని తెరకెక్కించిన విధానం, తెరపైన ఆ పాట సాగే విధానం చూసి అందరూ ఆశ్చర్యపోతారు. అలాంటి పాటలో నటించడం ఓ నటిగా నాకూ చాలా కొత్త అనుభవం. ఈ సినిమా కోసం దాదాపు 10 సెట్స్ నిర్మించారు. అనంత పద్మనాభ స్వామి ఆలయ సెట్ నిజమైన ఆలయాన్ని తలపిస్తుంది. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులూ మేమంతా నియమాలతో పనిచేశాం. పూర్తిగా శాకాహారమే తిన్నాం. రోజూ పూజ తర్వాతే అక్కడ చిత్రీకరణ మొదలయ్యేది. ఈ సినిమా నిర్మాణం, ప్రచారం నిర్మాతల అభిరుచికి అద్దం పడుతుందని నభా అన్నారు.

# సమంత ప్రెగ్నెంట్ అని తెలిసాక జాగ్రత్త పడ్డాం

## మా ఇంటి బంగారం షూటింగ్‌పై నందినిరెడ్డి వెల్లడి




అగ్ర కథానాయిక సమంత తల్లి కానున్న విషయం తెలిసాక..మా ఇంటి బంగారం' షూట్‌లో ఆమె కోసం చాలా జాగ్రత్తలు తీసుకున్నామని దర్శకురాలు నందినిరెడ్డి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో సమంత ఈ గుడ్‌న్యూస్ తనకు చెప్పారని.. ఎవరికీ చెప్పొద్దన్నారని 9 గంటలకు షూట్ ప్రారంభమవుతుందంటే సమంత కచ్చితంగా ఆ సమయానికి సెట్‌లో ఉంటారు. ఈ చిత్రంలో తస్సాదియా సాంగ్ షూటింగ్ అప్పుడు సమంతకు జ్వరం వచ్చిందని 11.30కు వస్తారని అన్నారు. నాకేమో టెన్షన్.. మొదట ఈ పాట 4 రోజులు చేయాలని అనుకున్నాం. షెడ్యూల్ కారణంగా రెండు రోజులకు కుదించాల్సి వచ్చింది. ఒకవైపు సామ్ హెల్త్ బాలేదు.. ఎలా పూర్తవుతుందా అని టెన్షన్ పడ్డాను. చెప్పినట్లే 11.30కు వచ్చి షూట్ కంప్లీట్ కాగానే వెళ్లిపోయింది. మళ్లీ రెండోరోజు రాగానే జ్వరం తగ్గిందా.. ఎందుకు అలా తరచూ వస్తోంది అని అడిగాను. 'జ్వరం కాదు.. నేను ప్రెగ్నెంట్‌ని. ఈ విషయం ఎవరికీ చెప్పకు' అని సమంత చెప్పింది. నాకు చాలా ఆనందం వేసిందని నందినిరెడ్డి అన్నారు. సమంత నాకు ఆ మాట చెప్పగానే డ్యాన్స్ మాస్టర్ దగ్గరకు వెళ్లి ఆమెకు ఆరోగ్యం బాలేదు. తనతో ఎక్కువ రిహార్సల్స్ చేయించొద్దు అని చెప్పాను. చిన్నచిన్న స్టెప్స్‌తో కంటిన్యూ చేద్దామని చెప్పా. సమంత మార్నింగ్ సిక్‌నెస్‌తోనే ఆ పాట పూర్తి చేసింది. కార్ యాక్సిడెంట్ సీన్, ఛేజింగ్ సన్నివేశం కూడా తర్వాత షూట్ చేసినవే. చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. 3.30 తర్వాత నీడలో షూట్ చేశాం.

# ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబో..

## సుబ్రమణ్యస్వామిపై నాగవంశీ వ్యాఖ్యలపై దుమారం

యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ప్రకటించిన సరికొత్త మైథలాజికల్ చిత్రం అప్పుడే సోషల్ మీడియాలో ఒక పెద్ద వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సుబ్రహ్మణ్య స్వామి నేపథ్యంతో రాబోతున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ భారీ అంచనాలను పెంచినప్పటికీ, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక క్యాప్షన్ తమిళ నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. మురుగన్‌ను ఉద్దేశించి ఆయన ఉత్తరాదిన జన్మించి, హృదయభూమిలో రూపుదిద్దుకుని, దక్షిణాదిన పూజలందుకుంటున్నాడు అని పోస్ట్ చేయడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. అంతేకాకుండా, అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో తమిళానికి బదులు సంస్కృత శ్లోకాన్ని ఉపయోగించడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ఎక్స్ లో ట్రోల్స్ చేస్తున్నారు.



అయితే మరోవైపు, పురాణాల ప్రకారం శివపార్వతుల కుమారుడైన కార్తికేయుడు హిమాలయాల్లో జన్మించాడని, దేవుడిని ఒక ప్రాంతానికే పరిమితం చేయలేమని మరికొందరు నెటిజన్లు నాగవంశీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు. ఈ సున్నితమైన భక్తిరస స్జబెక్ట్‌ను సాంస్కృతిక విలువలకు భంగం కలగకుండా ఎంతో జాగ్రత్తగా తెరకెక్కించాలని పలువురు మేకర్స్‌ను కోరుతుండగా, కేవలం ఒక్క పోస్టర్‌ను చూసి సినిమాను జడ్జ్ చేయవద్దని ఎన్టీఆర్ అభిమానులు మద్దతుగా నిలుస్తున్నారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085